


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162


ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 149 | శుక్రవారం 05- 06 -2026 | పేజీలు : 12 | No: KNL/3-77(D)/2026-2028 | వెల-3


## ఏపీ రాజ్యసభ సీట్ల పంపకం పూర్తి.. టీడీపీకి 3, జనసేనకు 1



## పర్యావరణ పరిరక్షణకు సైకిల్ వినియోగం

### ప్రజలకు చంద్రబాబు విజ్ఞప్తి



జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు సైకిల్ వినియోగించాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగే ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు.

## రష్యాలో కొనసాగిన లోకేశ్ పర్యటన

### బిజినెస్ ఫోరమ్‌లో పెట్టుబడులపై చర్చ



# మలేరియా పోస్టులపై చోటాల కన్ను



జీవీఎంసీలో ఉద్యోగాలంటూ కొందరు ఎమ్మెల్యేల అనుచరుల వసూళ్లపర్వం

వర్షాకాలం నేపథ్యంలో దోమల నియంత్రణకు తాత్కాలికంగా 431 మంది నియామకానికి జీవీఎంసీ ప్రతిపాదనలు

అవి జీవీఎంసీలో ఉద్యోగాలంటూ కొందరు ఎమ్మెల్యేల అనుచరులు ప్రచారం

ఆశావహుల నుంచి వసూళ్లకు రంగం సిద్ధం

గతంలో పనిచేసిన వారిని కాకుండా తాము చెప్పిన వారినే తీసుకోవాలంటూ ఎమ్మెల్యేల ద్వారా అధికారులకు ఫోన్లు

## దేశానికి యువతే ప్రాణం

### యువతను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటా ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి



## అవయవ మార్పిడి చట్టానికి ఆమోదం



- వివిధ రాష్ట్రాల్లో ఉన్నట్లుగానే అమలు
- బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం
- భీమిలీ తదితర బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- క్వాంటమ్ వ్యాలీ భూములకు స్టాంపు డ్యూటీ మినహాయింపు
- ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం
- కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు
- ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంపు
- ఎపి కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు..

### ప్రాంతీయ పార్టీలతో కేంద్రం రహస్య సంప్రదింపులు!



- డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం మరోసారి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం
- 2029 ఎన్నికల లోపే పూర్తి చేయాలని యోచన
- ప్రాంతీయ పార్టీలతో కేంద్రం సంప్రదింపులు
- గతంలోని వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి అడుగులు
- ఏకాభిప్రాయం కోసం ముందస్తు చర్చలు

2లో

# కార్మికులకు అండగా నిలిచేది బిఆర్ఎస్

### కార్మికుల సమస్యలపై సిఎంకు పట్టింపు లేదు - జలమండలి గేట్ మీటింగ్‌లో తలసాని శ్రీనివాసయాదవ్



ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పోరాడేది గులాబీ జెండా మాత్రమేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై ప్రసంగించారు. వాటర్ బోర్డులో 50 సంవత్సరాల లో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం 650 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వాటర్ వర్క్స్ బోర్డు లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్న రాంబాబు యాదవ్‌ను 6 వ తేదీన జరిగే గుర్తింపు ఎన్నికలలో గెలిపించుకోవాలని తలసాని పిలుపునిచ్చారు. మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకున్నముఖ్యమంత్రి రెండున్నర సంవత్సరాలలో ఒక్కసారైనా సమీక్ష చేశారా? అని తలసాని ప్రశ్నించారు. మీ సమస్యలపై ముఖ్యమంత్రికే పట్టింపు లేనప్పుడు ఆ పార్టీకి సంబంధించిన వ్యక్తిని గెలిపిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన చేతకాక ప్రశ్నించే వారిపై ఎదురుదాడి చేస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని తలసాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పవన్ కల్యాణ్ భాష, తీరు సరిగా లేదు



- తెలంగాణ ఆవిర్భావ వేడుకల వేళ పవన్ ఇక్కడ సభ పెడతాననడం సరికాదన్న గుత్తా
- చంద్రబాబు, పవన్, మంత్రులు అమరావతిలో ఉండాని సూచన
- తెలంగాణతో పోలిస్తే ఏపీకే ఎక్కువ వనరులు ఉన్నాయని వ్యాఖ్య

2లో

## రేవంత్ పర్యటన విహారయాత్ర లాంటిది



- పాలమూరు-రంగారెడ్డి పథకంలో ప్రభుత్వ తీరుపై శ్రీనివాస్ గౌడ్ విమర్శలు
- కసీఆర్ హయాంలోనే 80 నుంచి 90 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడి
- మిగిలిన పనులను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తోందని విమర్శ

2లో

## మమత పార్టీకి మరో షాక్



### బిధ్నానగర్ మేయర్ కృష్ణాచక్రవర్తి రాజీనామా

పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. బిధాన్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్

# అమీర్‌పేట్ మైత్రివనంలో భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాద్‌లోని ప్రముఖ వ్యాపార కేంద్రమైన అమీర్‌పేట మెయిన్ రోడ్డులో గురువారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మైత్రీవనం, మెట్రో పిల్లర్ నంబర్ 1043 కి సమీపంలో ఉన్న 'కేఎస్ఆర్ (ఖూ=) ఫ్యాషన్స్' అనే మూడు అంతస్తుల బట్టల దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భవనంలోని రెండో అంతస్తులో మొదలైన మంటలు, క్షణాల వ్యవధిలో నిలువెల్లా వ్యాపించి భవనం మొత్తాన్ని కమ్మేశాయి. దుకాణంలో అంతా



దుస్తులు (టెక్స్‌టైల్స్) కావడంతో మంటల తీవ్రత ఊహించని స్థాయిలో పెరిగింది. భగభగ మండుతున్న అగ్నికీలలు, దట్టమైన నల్లటి పొగ మైత్రీవనం జంక్షన్ పరిసర ప్రాంతాలను కమ్మేయడంతో స్థానికులు,

- భారీగా ఎగసిపడుతున్న మంటలు.. దట్టంగా అలుముకున్న పొగ
- కమర్షియల్ కాంప్లెక్స్‌లోని హెల్మెట్ షోరూంలో చెలరేగిన మంటలు
- మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

2లో

## రాహుల్ 'ఆర్థిక సునామీ' వ్యాఖ్యలు..



- దేశంలో ఆర్థిక సునామీ తప్పదని రాహుల్ గాంధీ హెచ్చరిక
- ఇది కేవలం భయాన్ని సృష్టించడమేనని తిప్పికొట్టిన బీజేపీ
- దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని పలు గణాంకాలు విడుదల
- ఎమర్జెన్సీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ గత చరిత్రను గుర్తుచేసిన నేతలు

# పవన్ కల్యాణ్ భాష, తీరు సరిగా లేదు

తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కూటమి నాయకులకు, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారు. మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన ఏపీ నాయకుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతున్న ఈ కీలక సమయంలో.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇక్కడ సభలు నిర్వహిస్తామనడం ఎంతమాత్రం సరైనది కాదని గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడిన భాష, ఆయన తీరు అస్సలు బాలేదని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిపై కూడా గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అని చెబుతున్న ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అక్కడి మంత్రులు ముందు అమరావతిలోనే నివాసం ఉండాలి" అని సూచించారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ వనరులు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఏపీకి సుదీర్ఘమైన సముద్ర తీరంతో పాటు, రకరకాల పోర్టులు కూడా ఉన్నాయని... కాబట్టి ఆ నాయకులంతా వారి రాష్ట్ర అభివృద్ధిని చూసుకోవాలి తప్ప, తెలంగాణ వైపు చూడాల్సిన అవసరం లేదని హితవు పలికారు. ఇక్కడ ఎలాంటి విద్వేషాలు సృష్టించడానికి ప్రయత్నించవద్దని హెచ్చరించారు. తెలంగాణ వ్యవసాయ రంగం, ధాన్యం కొనుగోళ్లపై గుత్తా సుఖేందర్ రెడ్డి పలు వివరాలను పంచుకున్నారు. తెలంగాణలో ఇప్పటికే 75 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రైతులు సాంప్రదాయ పద్ధతుల్లోనే కాకుండా పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని కోరారు. ప్రస్తుతం మన రైతులు వరి, పత్తి తప్ప వేరే ఇతర పంటలు పండించడం లేదని, దీనిపై మార్పు రావాలని ఆయన వివరించారు.

## రాహుల్ 'ఆర్థిక సునామీ' వ్యాఖ్యలు..

దేశంలో త్వరలో 'ఆర్థిక సునామీ' రాబోతోందని, ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను ప్రకటించవచ్చని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇవి కేవలం ప్రజల్లో భయాన్ని సృష్టించే ప్రయత్నాలని, భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ సవాళ్లను తట్టుకుని పటిష్ఠంగా ఉందని స్పష్టం చేసింది.బుధవారం కాంగ్రెస్ గిరిజన విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, దేశంలో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం తప్పదని హెచ్చరించారు. గతంలో ఆర్థిక ఒత్తిళ్ల నుంచి దేశాన్ని కాపాడిన వ్యవస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేకతను అణచివేసేందుకు ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించే అవకాశం ఉందని కూడా ఆయన వ్యాఖ్యానించారు.రాహుల్ ఆరోపణలపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు. రాహుల్ వ్యాఖ్యలు తప్పు మాత్రమే కాదు, ఇది కల్పితంగా భయాన్ని వ్యాప్తి చేయడమేనని విమర్శించారు. గత దశాబ్ద కాలంలో ఆర్థిక రక్షణ వ్యవస్థలు బలోపేతం చేశామని పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగం, వాహన అమ్మకాలు, ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం, భారీ విదేశీ మారక నిల్వలు వంటివి ఆర్థిక పటిష్ఠతకు నిదర్శనమని పేర్కొన్నారు. సునామీ 2013లో వచ్చిందని, ఇప్పుడు కాదని వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ ఈ దేశంలో వినాశనాన్ని సృష్టిస్తే, బీజేపీ దృఢంగా ముందుకు సాగుతోందని అన్నారు. కేంద్రమంత్రి, జేడీ(యూ) నేత లలన్ సింగ్ స్పందిస్తూ, రాహుల్ గాంధీకి ఆయన నానమ్మ ఇందిరా గాంధీ విధించిన 1975 ఎమర్జెన్సీని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. రాహుల్ పదేపదే ఇలాంటి హెచ్చరికలు చేస్తూ అస్థిరత సృష్టించాలని చూస్తున్నారని పలువురు బీజేపీ నాయకులు విమర్శించారు.

# మమత పార్టీకి మరో షాక్

కృష్ణా చక్రవర్తి.. గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారామె. రాజీనామా అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. 16 ఏళ్లుగా నేనీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ఎవరి పట్లా నాకే అసంతృప్తి లేదు. నిబంధనల ప్రకారమే రాజీనామా చేశా. నాకు నేను కొంత సమయం కేటాయించాలి అనుకుంటున్నాను. కౌన్సిలర్‌గా కొనసాగుతూ ప్రజలకు సేవ చేయదలచుకున్నాను' అని చెప్పారు. టీఎంసీ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీకి సన్నిహితురాలిగా ఉన్న కృష్ణా చక్రవర్తి తన రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. స్థానిక కార్పొరేషన్ అధికారులూ ఆమె రాజీనామా లేఖ అందిన విషయాన్ని ధ్రువీకరించారు. అలాగే రాష్ట్ర పురపాలక వ్యవహారాల శాఖ మంత్రి, అదనపు ప్రధాన కార్యదర్శికి కూడా లేఖ ప్రతులను పంపినట్లు అధికారులు తెలిపారు. ఆమె రాజీనామా ఆమోద పక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతుందని స్పష్టం చేశారు. కాగా.. తృణమూల్ కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కృష్ణా చక్రవర్తి నిర్ణయం బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. టీఎంసీకి సుదీర్ఘకాలంగా సేవలందించిన నేతగా, మమతకు అత్యంత సన్నిహితురాలిగా ఆమెకు పేరుండటంతో ఈ రాజీనామా ప్రాధాన్యం సంతరించుకుంది.


# అమీర్ పేట్ మైత్రీవనంలో భారీ అగ్ని ప్రమాదం ..

వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వేసవి తీవ్రత, ఎండల వేడి తోడవడంతో ఈ మంటలు పక్కనే ఉన్న ఇతర వ్యాపార సముదాయాలకు వేగంగా విస్తరించాయి. ప్రమాదం జరిగిన భవనం చుట్టుపక్కల హోటళ్లు, రెస్టారెంట్లు, కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్లు, మొబైల్ షాపులు వంటి వందలాది దుకాణాలు ఉండటంతో ముప్పు మరింత ఎక్కువైంది. మంటలు తమ షాపులకు ఎక్కడ అంటుకుంటాయోననే భయంతో పక్కనే ఉన్న వ్యాపారులు హుటాహుటిన తమ దుకాణాల్లోని విలువైన వస్తువులను, ఎలక్ట్రానిక్ పరికరాలను బయటకు తెచ్చి ప్రాణాలు చేతబట్టుకుని పరుగులు తీశారు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

## రేపు విశాఖకు సీఎం చంద్రబాబు...

## ఆక్వా ఎగుమతులపై జాతీయ వర్క్‌షాప్

ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం విశాఖపట్నంలో పర్యటించనున్నారు. సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై నగరంలో జరగనున్న కీలకమైన జాతీయ సదస్సుకు ఆయన హాజరుకానున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం సైకిల్‌పై ప్రయాణించడం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అధికారిక పర్యటన వివరాల ప్రకారం, సీఎం చంద్రబాబు శుక్రవారం ఉదయం 8:30 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 10:00 గంటలకు విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. అక్కడ 'నెట్ జీరో' కార్యక్రమంలో భాగంగా మొక్కను నాటి, అనంతరం బీచ్ రోడ్డులోని నోవోటెల్ హోటల్ వరకు సైకిల్‌పై ప్రయాణిస్తారు. హోటల్‌లో జరిగే జాతీయ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, రాజీవ్ రంజన్ సింగ్, జార్జ్ కురియన్, ఎస్పీ సింగ్ భగేల్ వంటి ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఆక్వాకల్చర్, మత్స్య రంగంలో అవకాశాలు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్‌తో పాటు ఇతర అంతర్జాతీయ మార్కెట్లకు మన ఉత్పత్తులను ఎగుమతి చేయడం, ఎదురవుతున్న సవాళ్లు, ప్రత్యామ్నాయ మార్కెట్లపై దృష్టి సారించనున్నారు. ట్రేసబిలిటీ వ్యవస్థలను పటిష్ఠం చేయడం, ఆక్వాకల్చర్‌లో సర్టిఫికేషన్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా స్థిరమైన పద్ధతులను అవలంబించడంపై చర్చిస్తారు. అలాగే, డీప్ సీ ఫిషింగ్, అండమాన్ నికోబార్, లక్షద్వీప్ వంటి ప్రాంతాల్లోని అధిక విలువ కలిగిన మత్స్య సంపద వినియోగం, సీవీడ్, ముత్యాల పెంపకం వంటి నూతన రంగాల అభివృద్ధిపై కూడా ఈ సదస్సులో కీలక చర్చ జరగనుంది. విలువ జోడించిన ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రాజెక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ (ఞా×) స్కీమ్, ఎంఎస్ఎంఈలకు లభించే మద్దతుపై కూడా ఈ వర్క్‌షాప్‌లో వివరించనున్నారు. ఈ సందర్భంగా పీఎంకేఎస్ఎస్‌వై (ఞవీఖూశ్), కిసాన్ క్రెడిట్ కార్డ్ (ఖజజ) పథకాల లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు ప్రోత్సాహకాలను అందజేస్తారు. సదస్సు ముగిసిన అనంతరం, విశాఖ ఎకనమిక్ రీజియన్‌పై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. తన పర్యటన ముగించుకుని సాయంత్రం తిరిగి అమరావతికి పయనమవుతారు.



# మలేరియా పోస్టులపై చోటాల కన్ను

జీవీఎంసీ మలేరియా విభాగంలో తాత్కాలిక ఉద్యోగాలపై ఎమ్మెల్యేల అనుచరుల కన్నుపడింది. మనవెంట తిరుగుతున్న వారికి అవకాశం కల్పిస్తే సంతోషపడతారని ఎమ్మెల్యేలకు చెప్పి...అధికారులకు ఫోన్‌లు చేయిస్తున్నారు. గతంలో పనిచేసిన వారిని కాకుండా తాము సూచించిన వారినే విధుల్లోకి తీసుకోవాలంటూ చెప్పిస్తున్నారు. ఆ తరువాత తెర వెనుక వసూళ్లకు తెరదీస్తున్నారు.వర్షాకాలంలో దోమల నివారణ చర్యలు చేపట్టేందుకుగాను 431 మంది కార్మికులను తాత్కాలికంగా (మూడు నెలలు పాటు) పనిలోకి తీసుకునేందుకు జీవీఎంసీ మలేరియా విభాగం అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. గతంలో ఇదే పని చేపట్టిన కార్మికులను తీసుకుంటే వారికి కొంత అవగాహన ఉంటుంది కాబట్టి మెరుగైన ఫలితాలు వస్తాయని భావించారు. అయితే నగరానికి చెందిన కొందరు ఎమ్మెల్యేల అనుచరులు దానిని సొమ్ము చేసుకునేందుకు ఉబలాటపడుతున్నారు.వర్షాలు జూన్‌లో ప్రారంభమై సెప్టెంబరు/అక్టోబరు వరకు కురుస్తుంటాయి. ఈ కాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. అందుకే జూన్ నుంచి అక్టోబరు వరకు 'అపిడమిక్ సీజన్‌గా' ప్రజారోగ్య విభాగం అధికారులు పరిగణిస్తారు. అపిడమిక్ సీజన్‌లో దోమల వృద్ధిని నియంత్రించడంతోపాటు అందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జీవీఎంసీ ఏటా మూడు నెలల పాటు రోజువారీ కూలీ ప్రాతిపదికన 431 మందిని నియమించుకుంటుంది. వీరందరికీ గతంలో కాంట్రాక్టర్ ద్వారా వేతనాలు చెల్లించేవారు. గత రెండేళ్లుగా స్వయం సహాయక సంఘాల ద్వారా చెల్లిస్తున్నారు. మూడు నెలల తర్వాత కూడా దోమల బెడద ఉంటే మరో మూడు నెలలు వారి సేవలను పొడిగిస్తారు. ఏటా ఇదే మాదిరిగా జరుగుతూ వస్తోంది. ఈ ఏడాది కూడా అపిడమిక్ సిబ్బందిని సిద్ధంగా ఉంచుకునేందుకు ప్రజారోగ్య విభాగం అధికారులు 431 మంది కార్మికులను మూడు నెలలపాటు నియమించుకునేందుకు ప్రతిపాదనలు తయారుచేసి కమిషనర్‌కు పంపించారు. కమిషనర్ నుంచి ఆమోదం రాగానే గత సీజన్‌లో పనిచేసిన వారిలో ఆసక్తి ఉన్నవారిని తీసుకుని, మిగిలిన ఖాళీల్లో కొత్తవారిని తీసుకోవాలని అధికారులు భావించారు. గతంలో పనిచేసిన వారికి దోమల లార్వా గుర్తింపు, వాటిని ధ్వంసం చేయడంపై అవగాహన ఉంటుంది కాబట్టి, మెరుగైన ఫలితాలను ఉంటాయన్నది అధికారుల ఆలోచన.

**జీవీఎంసీలో ఉద్యోగాలంటూ కొందరు ఎమ్మెల్యేల అనుచరుల వసూళ్లపర్వం**

మలేరియా విభాగంలో మూడు నెలల కాల పరిమితితో తీసుకునే ఆ ఉద్యోగాలను జీవీఎంసీలో పోస్టులంటూ కొందరు ఎమ్మెల్యేల అనుచరులు ప్రచారం చేస్తున్నారు. ఆశావహులు ఎవరైనా వస్తే వారి నుంచి ఎంతో కొంత తీసుకుని ఆ ఉద్యోగాలను కట్టబెట్టాలని భావిస్తున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యేలకు జీవీఎంసీలో మలేరియా పోస్టులు తీస్తున్నారని, మూడు నెలలు పాటే అయినప్పటికీ మనవెంట తిరుగుతున్న వారికి అవకాశం కల్పిస్తే వారంతా సంతోషపడతారని చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులకు ఎమ్మెల్యేలతో ఫోన్ చేయించి గతంలో పనిచేసినవారిని కాకుండా తాము సూచించే వారిని ఉద్యోగంలో తీసుకోవాలని చెప్పిస్తున్నారు. ఎమ్మెల్యేల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు కొత్తవారిని తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేస్తే...తాము డబ్బులు వసూలు చేసిన వారిపేర్లతో కూడిన జాబితాను పంపించేయాలని చూస్తున్నారు. అధికారులు, ఎమ్మెల్యేలు ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించకపోతే గతంలో పనిచేసినవారు రోడ్డెక్కడం ఖాయమని పేర్కొంటున్నారు.

# రష్యాలో కొనసాగిన లోకేశ్ పర్యటన

రష్యాలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఎస్పీఐఈఎఫ్ బిజినెస్ ఫోరం ససస్సులో ఆంధ్రప్రదేశ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. భారత్, రష్యాల మధ్య ఉన్న సుదీర్ఘ సాంకేతిక, ఆర్థిక అనుబంధాన్ని గుర్తుచేస్తూ, 2030 నాటికి 100 బిలియన్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవడంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో ఆంధ్రప్రదేశ్‌ను 2.5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ధ్యేయమని ప్రకటిస్తూ.. అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను కేవలం పెట్టుబడిదారులుగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో సమాన భాగస్వాములుగా ఆహ్వానించారు. ఈ సదస్సులో భాగంగా రష్యాకు చెందిన ప్రముఖ ఉక్కు దిగ్గజం 'నోవోస్టల్-ఎం సంస్థ చైర్మన్ ఇవాన్ డెమ్చెంకోతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భారతదేశంలో అత్యాధునిక ఈఏఎఫ్ (ఇంఈ) గ్రీన్ స్టీల్ ఎ÷-లాంట్ నిర్మాణాన్ని చేపట్టాలని, అదేవిధంగా ఏపీలోని ప్రతిష్ఠాత్మక పారిశ్రామిక హబ్ 'శ్రీసిటీ'లో రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లును ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ 'సిస్టమా' ప్రెసిడెంట్ తాగిర్ సిట్దేకోవ్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేష్.. రాష్ట్రంలో సరికొత్త రవాణా, సాంకేతిక ప్రాజెక్టులపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్గత జలరవాణా మార్గాలలో పర్యావరణ అనుకూల 'ఎలక్ట్రిక్ రివర్ మెట్రో' పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించాలని కోరారు. దీంతో పాటు భవిష్యత్ సాంకేతికతలకు కేంద్రంగా నిలుస్తున్న ఏపీ 'క్వాంటమ్ వ్యాలీ ఫ్రేమ్ వర్క్' ప్రాజెక్టులో సిస్టమా సంస్థను భాగస్వామి కావాల్సిందిగా మంత్రి నారా లోకేష్ ఆహ్వానించారు. లోకేశ్‌తో లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు ఉన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు సైకిల్ వినియోగం

ఆ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు సైకిల్‌పై వెళ్లనున్నారు. పర్యావరణ హితమైన సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు, పార్టీ నేతలతోపాటు ప్రభుత్వంలో పని చేసే వారంతా శుక్రవారం సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం. ఈ సందర్భంగా గురువారం ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆయన ఏమన్నారంటే.. 'రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దాం. భూమి మన ఇల్లు? ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత. సహజ వనరులను కాపాడుకుంటూ, గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దాం. పచ్చదనం పెంపు, ఇంధన వనరులు పొదుపుగా వినియోగించడం అవసరం. అందులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న సైకిళ్లు, ఈ-సైకిళ్లపై ప్రయాణిద్దాం. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుదాం. రేపటి నా విశాఖ పర్యటనలో నేను సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను. అంతా సహకరించాలని, మంచి కార్యక్రమానికి కలిసి రావాలని కోరుతున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# దేశానికి యువతే ప్రాణం

తన రాజకీయ ప్రయాణంలో యువత పాత్రను ప్రత్యేకంగా స్మరించుకుంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్.. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 2008లో ప్రజారాజ్యం పార్టీ(పీఆర్పీ) యువజన విభాగం 'యువరాజ్యం' కోసం పటిష్ఠమైన యువజన విభాగం నిర్మించాలని ప్రణాళిక చేశానని తెలిపారు. జనసేన పార్టీని స్థాపించి 12 ఏళ్లలో ఎన్నో కష్టాలు, పోరాటాలను అధిగమించిన తర్వాత.. పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అనుభవం, పరిణితితో నిండి, సంస్థాగత బాధ్యతలు చేపట్టడానికి, రాజకీయాలు నిర్వహించడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువరాజ్యం యువజన విభాగానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు తనను విశ్వసించి అండగా నిలిచిన యువతకు పవన్

ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, దేశభక్తి కలిగిన యువతను, చైతన్యవంతమైన నాయకులను తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పవన్ ప్రతిజ్ఞ చేశారు. నూతన భారత్.. జెన్‌జెడ్ తరం నుంచి అద్భుతమైన నాయకుల ఆవిర్భావానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. జెన్‌జెడ్ తరం.. బుజ్జగింపు రాజకీయాలు, వంశపారంపర్య రాజకీయాలు, కుల రాజకీయాలు, విభజన రాజకీయాలు, ప్రాంతీయ రాజకీయాలతో విసిగిపోయిందని అభిప్రాయపడ్డారు. ఈ తరం.. జవాబుదారీతనం గల రాజకీయాలను తీసుకురాగల నాయకుల కోసం ఎదురుచూస్తోందని చెప్పారు. అంతేగానీ, ప్రపంచ వేదికలపై భారత్‌ను బలహీనపరిచే నాయకుల కోసం కాదన్నారు. బలమైన, పటిష్ఠమైన భారత్‌ను నిర్మించగల నాయకుల కోసం జెన్‌జెడ్ యువత ఎదురుచూస్తోందని ఎక్స్ ఖాతాలో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# కార్మికులకు అండగా నిలిచేది బిఆర్ఎస్

ఈ ప్రభుత్వం అవగాహన, ప్రణాళిక లేకుండా మూడు కార్పొరేషన్లుగా విభజించి ఉద్యోగులు, ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని తలసాని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ రోజు కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా త్రాగునీటిని సరఫరా చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం త్రాగునీటిని కూడా సక్రమంగా ఇవ్వలేకపోతుందని మండిపడ్డారు. మీకు అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీ అని, మీ హక్కుల కోసం అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రకటించారు. మీ కోసం గొంతుక వినిపించే గులాబీ జెండాకు మద్దతు తెలపాలని తలసాని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బోర్డులోని అనేక సమస్యలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అటు సూర్యుడు ఇటు పొడిచినా మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తలసాని హామీ ఇచ్చారు.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు..

నియోజకవర్గాల పునర్విభజన బిల్లును మరోసారి తెచ్చే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఇది సున్నితమైన అంశం కావడంతో ఎలాంటి వివాదాలకు తావులేకుండా రాజకీయంగా ఏకాభిప్రాయం సాధించాలని ప్రభుత్వం యత్నిస్తున్నట్లు సదరు వర్గాలు వెల్లడించాయి. ఈ సంప్రదింపుల్లో భాగంగా కేంద్రం ఇప్పటికే తమిళనాడుకు చెందిన డీఎంకేతో పాటు పలు కీలక ప్రాంతీయ పార్టీలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య 1971 జనాభా లెక్కల ఆధారంగానే చేసి ఉంది. ఆ గడువు ముగియనుండటంతో కొత్తగా పునర్విభజన చేపడితే జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరిగి, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతాయనే తీవ్ర ఆందోళనలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ఫార్ములాను రూపొందించేందుకు కేంద్రం యత్నిస్తోందని సమాచారం. నిజానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంటు ముందుకు తీసుకువచ్చింది. అయితే ఆ సమయంలో ప్రాంతీయ పార్టీల నుంచి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఫలితంగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు వీగిపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే.. ఈసారి బిల్లును నేరుగా సభలో పెట్టకుండా, ముందుగానే విస్తృత అవగాహన కుదిరిన తర్వాతే తదుపరి అడుగు వేయాలని కేంద్రం భావిస్తోందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది.

# అవయవ మార్పిడి చట్టానికి ఆమోదం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్నయాలు తీసుకున్న ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఆ నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ చట్టం అమలుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. 2011 కేంద్ర చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. అవయవ మార్పిడి పక్రియలో పారదర్శకత, వైద్య సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులో ఉన్న విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం తెలిపింది. భీమిలి, విశాఖపట్నం, శ్రీకాకుళం, చీరాల బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా ఈ పాలసీ అమలు చేయనున్నారు. గోవా, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల అనుభవాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే బీచ్ షాక్స్‌లు తెరిచి ఉంచడానికి అనుమతి ఇవ్వనున్నారు. పరిమిత రకాల మద్యం విక్రయాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే తదుపరి విస్తరించే అవకాశం ఉంది. రాజధాని అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఏవియేషన్, ఉపాధి, మత్స్యరంగం, పోలవరం, పారిశ్రామిక పార్కులు, పోర్టులు, పర్యాటకం వంటి వివిధ రంగాల్లోని ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి కేటాయించిన భూమి రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపును ఆమోదించింది. రాష్ట్రంలో రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ-2025 ముసాయిదాకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మద్దువలస, యేలేరు రిజర్వాయర్లలో ఫిషిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే అగ్రిగోల్డ్ తదితర డిపాజిటర్ల కేసుల పరిష్కారం కోసం 21 పోస్టుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చిత్తూరు జిల్లాలో వ్యవసాయ శాఖ భూమిపై సోలార్ విద్యుత్ ఎ÷-లాంట్ ఏర్పాటుకు 30 ఏళ్ల లీజు ఇవ్వడానికి అనుమతి ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ హామీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు టెండర్లకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. రాజధాని అమరావతిలో పలు నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. పోలవరం సహా వివిధ ప్రాజెక్టుల పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీపీఎస్ అమల్లోకి రాకముందు ఇచ్చిన నోటిఫికేషన్లలో ఎంపికై.. వివిధ కారణాలతో సీపీఎస్ అమలు తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పింఛను వ్యవస్థ అమలు చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీలో సవరణలకు కేబినెట్ ఆమోదించింది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ ను జులై 1 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసే ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.

# ఏపీ రాజ్యసభ సీట్ల పంపకం పూర్తి..

## టీడీపీకి 3, జనసేనకు 1

**రాజ్యసభ సీట్ల పంపకాలపై కొలిక్కి వచ్చిన ఫార్ములా**

**టీడీపీకి మూడు, జనసేనకు ఒక స్థానం కేటాయింపు**

**ఈసారి బీజేపీకి దక్కని రాజ్యసభ అవకాశం**

**సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన సమావేశంలో తుది నిర్ణయం**

**జూన్ 18న నాలుగు స్థానాలకు జరగనున్న పోలింగ్**

ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలకు సంబంధించి అధికార ఎన్డీఏ కూటమిలో సీట్ల పంపకం ఖరారైంది. కూటమిలోని ప్రధాన పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మూడు స్థానాలను తీసుకోనుండగా, జనసేన పార్టీకి ఒక స్థానాన్ని కేటాయించారు. ఈ సర్దుబాటులో బీజేపీకి ఈసారి అవకాశం లభించలేదు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు. ఈ భేటీలో మిత్రపక్ష నేతలతో చర్చించిన అనంతరం, సీట్ల కేటాయింపు నిర్ణయాన్ని సీఎం స్వయంగా వెల్లడించారు. మూడు పార్టీల నేతల ఏకాభిప్రాయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే రాజ్యసభ అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలం ఆధారంగానే ఈ కేటాయింపులు జరిపినట్లు స్పష్టమవుతోంది. అసెంబ్లీలో టీడీపీకి భారీ మెజారిటీ ఉండగా, జనసేనకు 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.షెడ్యూల్ ప్రకారం జూన్ 18న నాలుగు రాజ్యసభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం వైసీపీకి చెందిన మూడు, టీడీపీకి చెందిన ఒక స్థానం ఖాళీ అవుతున్నాయి. అసెంబ్లీలో ఎన్డీఏ కూటమికి ఉన్న పూర్తి ఆధిక్యతతో ఈ నాలుగు స్థానాలనూ గెలుచుకోవడం లాంఛనప్రాయమే. కాగా, నేటి ఎన్డీయే సమావేశంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు మూడు ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జూన్ 9న తిరుపతిలో 'సంక్షేమం', 12న అమరావతిలో 'సుపరిపాలన', 15న విశాఖపట్నంలో 'అభివృద్ధి' అనే అంశాలపై సభలు జరపాలని చంద్రబాబు సూచించారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్ ఆవిష్కరించిన మర్రిపాడు వైఎస్సార్సీపీ నేతలు





**మర్రిపాడు జూన్ 4నంది పత్రిక :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఆ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.మర్రిపాడులోని వైఎస్సార్సీపీ పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కన్వీనర్ చెన్ను వెంకటేశ్వర్లు రెడ్డి,మాజీ మండల కన్వీనర్ బొర్రా.సుబ్బిరెడ్డి,మండల యువజన అధ్యక్షుడు చంద్ర.నారాయణస్వామి,ఎ. ప్రతాప్ రెడ్డి,ఎంపీటీసీ హజరత్ రెడ్డి తదితరులు మాట్లాడారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను నిరాశపరిచిందని విమర్శించారు. సంపద సృష్టిస్తామని చెప్పి ప్రజలకు ప్రయోజనం చేకూర్చే ఒక్క పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నవరత్నాలు, విద్య, వైద్యం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యాయని పేర్కొన్నారు. గ్రామ,వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది కుటుంబాలకు సేవలు అందించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు.రాష్ట్రంలో ప్రస్తుతం విధ్వంసకర పాలన కొనసాగుతోందని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఐదేళ్లపాటు సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిందని అన్నారు. జూన్ 4 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న కార్యక్రమాల ద్వారా కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న తేడాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు.అనంతరం నాయకులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వ హామీలకు సంబంధించిన కరపత్రాలను దహనం చేసి ఆందోళన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కే.కొండారెడ్డి,సోషల్ మీడియా కన్వీనర్ పొంగూరు.సుధాకర్,విద్యార్థి విభాగ అధ్యక్షులు బొర్రా.విష్ణు,గంగినేని.విజయ్ కుమార్,రామనాయుడుపల్లి సర్పంచ్ పెదరాయుడు,సీనియర్ నాయకులు రఘురామ్,రామ్మోహన్ రెడ్డి, మండల సోషల్ మీడియా వింగ్ నాయకుడు పరిమి వెంగళరావు,చెన్ను కృష్ణారెడ్డి,రామకృష్ణారెడ్డి,వెంగల్ రెడ్డి,మండేది ఓబుల్ రెడ్డి,ఒంగోలు బాలకృష్ణారెడ్డి,రామచంద్రారెడ్డి, ముసలారెడ్డి,యడవల్లి కృష్ణ, షేక్ ఖాన్ సావలి,పంగులూరి వెంకటేశ్వర్లు,కత్తి.

పద్మారావు మండల బీసీ అధ్యక్షుడు జి.నాగరాజు యాదవ్,నాజ సెల్ అధ్యక్షులు రామకృష్ణ తదితర నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెన్నుపోటుకు రెండేళ్ళు...రాష్ట్ర ప్రజలను మోసం చేసిన చంద్ర బాబు ప్రభుత్వం...

### ఇచ్చిన హామీలను నెరవేర్చలేదంటూ... ఉమ్మడి మేనిఫెస్టో ప్రతుల దహనం.. వైసీపీ



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 4 ( నంది పత్రిక )** రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదంటూ వైసీపీ శ్రేణుల ఆగ్రహం వ్యక్తం చేశాయి. నంద్యాల పట్టణం సాయి బాబా నగర్ డా. వైఎస్సార్ సర్కిల్ వద్ద తెలుగుదేశం పార్టీ ఉమ్మడి మేనిఫెస్టో ప్రతులను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, ఎమెల్సీ ఇస్సాక్ బాష ఆద్వర్యంలో నంద్యాల అసెంబ్లీ పరిశీలకుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి, శ్రీశైలం నియోజక వర్గ పరిశీలకుడు పి.పి మధుసూదన్, ఈసీఎస్ మెంబర్ కల్లూరి రామలింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మరియు కార్యకర్తలు దహనం చేశారు. ముందుగా డా వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నేతలు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.



# విజయం గమ్యం కాదు..

## ఉన్నత లక్ష్యాలకు తొలి అడుగు

**సబ్జెక్టుపై పట్టు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతోనే శిఖరాగ్రాలకు చేరుకోవాలి**

**ప్రతిభావంతులైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఘన సత్కారం**



**నంద్యాల బ్యూరో, జూన్ 04(నంది పత్రిక):-** ఒక విజయం వద్దే ఆగిపోకుండా, దానిని మరిన్ని విజయాలకు పునాదిగా మలుచుకుని ఉన్నత లక్ష్యాల సాధన దిశగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ప్రశంసాపత్రాలు, మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వారి విజయాన్ని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయాలు కేవలం పరీక్షల ఫలితాలకు మాత్రమే పరిమితం కాకుండా, భవిష్యత్ జీవితానికి బలమైన పునాది కావాలని ఆకాంక్షించారు. గురుకుల విద్యాసంస్థల్లో చదివి పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 12 మంది, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులతో పాటు ఏపీ మోడల్ స్కూల్, బీసీ వెల్ఫేర్ విద్యాసంస్థలకు చెందిన మరో ఐదుగురు విద్యార్థులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం విద్యా, ఉద్యోగ రంగాల్లో పోటీ తీవ్ర స్థాయికి చేరుకుందని, కేవలం మార్కులు సాధించడం మాత్రమే కాకుండా సబ్జెక్టుపై లోతైన అవగాహన, విశ్లేషణాత్మక దృష్టి, నిరంతర అధ్యయన తపన అవసరమని పేర్కొన్నారు. బట్టీ పట్టే విధానానికి బదులుగా ప్రతి అంశాన్ని అర్థం చేసుకుంటూ నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రశ్నించే విద్యార్థే నిజమైన విద్యార్థి అవుతాడని, జిజ్ఞాసే విజయానికి మూలమని చెప్పారు. విద్యార్థులు సమాజంలో జరుగుతున్న పరిణామాలు, దేశ-విదేశాల్లో చోటుచేసుకుంటున్న మార్పులపై అవగాహన పెంపొందించుకోవాలని, నిరంతరం తమ జ్ఞానాన్ని నవీకరించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. విద్యలో విజయం సాధించినప్పటికీ వినయాన్ని కోల్పోకూడదని, అపజయాలు ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా వాటిని పాఠాలుగా స్వీకరించి మరింత బలంగా ఎదగాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టం, త్యాగాలు విద్యార్థుల విజయాలకు పునాది కావాలని, వారి ఆశయాలను సాకారం చేయాలనే బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. స్వీయ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథం జీవితంలో ఉన్నత శిఖరాలకు చేర్చగలవని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు హాబీలు, క్రీడలు, లైఫ్ స్కిల్స్‌ను అలవర్చుకోవాలని, పుస్తక పఠనం, మొక్కల పెంపకం, ఈత, కరాటే వంటి కార్యకలాపాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని వివరించారు. అలాగే నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్యల పరిష్కార సామర్థ్యం వంటి సాఫ్ట్ స్కిల్స్ ఆధునిక ప్రపంచంలో అత్యంత కీలకమని తెలిపారు. తమతో పాటు వెనుకబడిన సహ విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారికి మార్గదర్శనం చేయడం ద్వారా సామాజిక బాధ్యతను చాటాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వ్యక్తిగత విజయంతో పాటు సమాజాభివృద్ధికి కూడా తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, బాధ్యతాయుత పౌరులుగా ఎదిగి దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలను మరింత ఉన్నత లక్ష్యాలకు పునాదిగా మలుచుకుని జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పిల్లల విజయాల వెనుక తల్లిదండ్రులు అందించిన సహకారం, ఉపాధ్యాయులు అందించిన మార్గదర్శకత్వం అమూల్యమని పేర్కొంటూ వారందరికీ కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ప్రకృతి బి ప్రగతికి చోదక శక్తి



నంది పత్రిక:ప్రకృతి రక్షణ ప్రజల సంరక్షణపచ్చని చెట్లే ప్రగతికి బాటలుప్రకృతి జీవ ప్రదాత ప్రకృతి ప్రగతికి పురోగతికి చోదక శక్తిసహజ వనరును రక్షిద్ధాంస్వయం స్వమృద్ధి సాదిద్దాం.మానవుని అనాలోచిత చర్యలు పెరుగుతున్న వాతావరణ వైపరీత్యాలు ఉద్రుతమౌతున్న విపత్తులు కాలుష్యమౌతున్న ప్రకృతిమానవ స్వార్థానికి విధ్వంస మౌతున్న ప్రకృతిస్వార్థపు నీడలో ప్రకృతివిలపిస్తోందిమనిషిచేసేగాయాలకు ధరణీ తల్లడిల్లుతోంది.పచ్చని అడవులు కాంక్రీట్ వనాలుగా మారుతుంటేభవిష్యత్తు తరాల మనుగడప్రశ్నార్థకమవుతుంది.దేశాల మధ్య పోటీ ప్రపంచీకరణ సాంకేతీకరణకార్పోరేటీకరణ వాణిజ్యవాధంప్రకృతి పర్యావరణ పతనానికి హేతువైపరిశ్రమలు వెదజల్లేఘన ద్రవ వాయువులతోనీరు నేల కాలుష్యమైమానవ మనుగడ ప్రమాదకరమైంది.విశ్వ జనావళికి వైరస్ లే సంపద అవుతే అనారోగ్యమే ఆస్తి అయ్యింది.విచ్చల విడి ప్లాస్టిక్ వినియోగ వరదల ప్రవాహాన్ని అడ్డుకొనిజల ప్రళయంతో జనం విల విలమానవుని విచక్షణ రహిత ప్రవర్తనప్రకృతినికబలిస్తుంది.మానవాళి దురాశజీవవైవిద్యానికి చేటుఓ పౌరుడా ఇకనైనా మేలుకో ప్రకృతి రక్షణ నీ ప్రథమ కర్తవ్యంగా ఎంచుకోప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనే మన లక్ష్యం కావాలి.చెరువుల కబ్జాలతోవిలాస వంతమైన విల్లాలతోప్రకృతిని నాశనం చేస్తూభూతాపం పెంచే చర్యలు మానుకోవాలిప్రకృతి పర్యావరణం పట్ల జనం అవగాహన చైతన్యం పెంచుకొవాలి.చేయి చేయి కలుపుదాం ఊరూరా మొక్కలు నాటుదాం.నీటి చుక్కను పొదుపుగా వాడుదాం.నీల తల్లి ఋణం తీర్చుకుందాం.కాలుష్య రహితసమాజస్థాపనకైముందుకు సాగుదాం.ప్రకృతి పర్యావరణ రక్షణకైపౌర సమాజం ఉద్యమించాలి.అవగాహన చైతన్యంతోజన జాగృతికై ఉపక్రమించాలి.ప్రకృతి ఉద్ధరణ ఉద్యమంగాకొనసాగాలి.నేదునరి కనకయ్యఅధ్యక్షులుతెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరంతెలంగాణ ఎకనామిక్ ఫోరం సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక కరీంనగర్(జూన్5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా)

## సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి?

### రెండేళ్ల పాలనపై వైసీపీ ఆగ్రహ ర్యాలీ




**పోరుమామిళ్ల, జోన్ 4 (నంది పత్రిక ):**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన చంద్రబాబు పాలనకు రెండేళ్లు పూర్తైన సందర్భంగా బద్వేల్ నియోజకవర్గంలోని పోరుమామిళ్లలో వైసీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.అంబేద్కర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు జరిగిన ఈ ర్యాలీలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా, మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి, అలాగే కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండేళ్ల కూటమి పాలనలో రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని విమర్శించారు. జగనన్న హయాంలో అమలైన కాపు నేస్తం, ఆరోగ్యశ్రీ, జగనన్న కాలనీలు వంటి సంక్షేమ పథకాలు ప్రస్తుతం నిలిచిపోయాయని ఆరోపించారు.డ్వాక్రా సంఘాలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గిట్టుబాటు ధరలు లేకపోవడం, ఎరువుల కొరత, ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తోందని, ఈ భారం భావితరాలపై పడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రజలు మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా చూడాలని భావిస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నాయకులు పేర్కొన్నారు.

# ఘనంగా భారత జాతీయ మహిళా సమాఖ్య 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కర్నూలు ప్రతినిధి నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కర్నూలు జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యాలయం నందు ఏపీ మహిళా సమాఖ్య కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి పి శ్రావణి రెడ్డి అధ్యక్షతన జెండా ఆవిష్కరణ జరిగినది జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహిళా సమాఖ్య జిల్లా సీనియర్ నాయకురాలు జిల్లా అధ్యక్షురాలు మాజీ కార్పొరేటర్ ఎస్ గిడ్డమ్మ జెండా ఆవిష్కరించి ఆమె మాట్లాడుతూ 1954లో భారత జాతీయ మహిళా సమాఖ్య కలకత్తా లో ఏర్పాటు చేయబడింది ఏర్పాటు చేసే దానిలో ప్రముఖ పాత్ర వహించిన హజారా బేగం అరుణ ఆశఫ్ అలీ అనసూయ జ్ఞాన్ చంద్ పుష్పమయి బోస్ రేణు చక్రవర్తి విమల ఫరుకి గీతా ముఖర్జీ ప్రమీలా లుముంబాలతో తారారెడ్డి గుజ్జుల సరళ దేవి గార్ల నాయకత్వంలో భారత జాతీయ మహిళా సమాఖ్య పురుడు పోసుకుని నాటి నుండి నేటి వరకు మహిళా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసి ఈ దేశంలోని మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ మహిళలకు ఇవ్వాలని ఆనాటి ఉత్తమ పార్లమెంటరీ కామ్రేడ్ గీతా ముఖర్జీ నాయకత్వంలో పార్లమెంటులో గళం విప్పి పోరాటం చేసింది గీతా ముఖర్జీ ఈ దేశంలో నీ మహిళలకి స్వేచ్ఛ సమానత్వం స్వాతంత్రం కావాలని నేటిదాకా పోరాటం చేస్తున్నది మహిళా సమాఖ్య మాత్రమే దేశంలో పరిపాలన చేస్తున్న నరేంద్ర మోడీ బేటి బచావో బేటి పడావో అన్న నినాదంతో పరిపాలన చేస్తున్నాడే గాని మణిపూర్ లాంటి రాష్ట్రాలలో మహిళలపై అత్యాచారాలు హత్యలు దాడులు జరుగుతున్న కళ్ళుండి చూడలేని దేశ ప్రధాని గారు బేటి పడావో బేటి బచావో అన్న నినాదం మరి ఎక్కడ నెరవేరిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు ఈ దేశంలోని ఈ రాష్ట్రంలోని మహిళల కోసం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు కోటమ్మ రేణుక ఆశా బేగం సోఫియా నగర నాయకురాలు పావని వెంకటేశ్వరమ్మ మునెమ్మ స్వప్న మాధవి యశోద మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ పైన 20 డీజిల్ పైన 35 రూపాయలు పన్నును ఉపసంహరించుకోవాలి సిపిఐ





**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూల్ నగరంలో వామపక్ష పార్టీల రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఈనెల ఒకటో తారీకు నుండి ఏడో తారీఖు దాకా దేశవ్యాప్తంగా పెరిగిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని ఇంకా పెంచాలని ఆలోచనలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం కర్నూలు నగరంలో సిపిఐ సిపిఎం సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో నగరంలో వివిధ వార్డులలో స్థానిక సమస్యలను తెలుసుకుంటూ పెరిగిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ రేట్లను ప్రచారం చేస్తూ వీధులలో తిరగడం జరిగినది ఈ కార్యక్రమం ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీలో జొహరాపురం ఏరియాలలో బంగారు పేట గీతా ముఖర్జీ నగర్ ఏరియాలలో పార్టీ కార్యకర్తలతో ప్రజల్ని చైతన్యవంతం చేస్తూ ప్రచారం చేయడం జరిగినది ఈ కార్యక్రమాలలో సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ కే జగన్నాథం సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి జిల్లా నాయకులు మనోహర్ మాణిక్యం నగర సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు సురేష్ గిడ్డమ్మ బీసన్న కుమార్ నాగరాజు అన్వర్ తదితరులు ఈ ప్రచార ఆందోళన కార్యక్రమానికి నాయకత్వం వహించారు ఈ సందర్భంగా జగన్నాథ్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరో ఒక మాట అనే విధంగా ఈనాటి పాలకుల విధానాలు ఉన్నాయని ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోయిన వెంటనే పెట్రోల్ డీజిల్ గ్యాస్ రేట్లను 11 రోజుల వ్యవధిలో దాదాపు నాలుగుసార్లు పెంచడం సిగ్గుచేటని ఈ పాలకులకి ఈ దేశంలో ఉన్న ప్రజల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది పెట్రోలు డీజిల్ గ్యాస్ రేట్ పెరగడం ద్వారా అన్ని రకాల నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటే పరిస్థితి ఉన్నది పెట్రోలు డీజిల్ పెరగడం ద్వారా రవాణా వ్యవస్థ పైన విపరీతమైనటువంటి భారం పడే పరిస్థితి ఉన్నది. ఈ భారాలను భరించలేక రవాణా వ్యవస్థ రేట్లు పెంచడం ద్వారా అవి నిత్యవసర వస్తువుల పైన ప్రభావం పడే పరిస్థితి ఉన్నది కావున తక్షణమే పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలను ఇప్పటిదాకా పెంచిన రేట్లను ఉపసంహరించుకుంటూ మరి పెంచాలనే ఆలోచనను విరమించుకోవాలని వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ పైన 20 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం 35 రూపాయలు పన్నులు వేయడం ద్వారా రేట్లు విపరీతంగా పెరుగుతున్నాయి తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులు ఉపసంహరించుకోవడం ద్వారా ఈ రాష్ట్రంలోని ప్రజలకు రవాణా రంగానికి పెట్రోలు డీసులు 50 రూపాయలకే 55 రూపాయలకే దొరికే పరిస్థితి ఉందని వారన్నారు స్థానికంగా కర్నూల్ నగరంలో ఏ వీధికి వెళ్ళిన రోడ్ల సమస్య మురికి కాలువల సమస్య మంచినీళ్ల సమస్య విపరీతంగా ఉన్నదని తక్షణమే సిసి రోడ్లు లేని చోట రోడ్ల నిర్మాణం చేపట్టాలని రోడ్లు వేసిన చోట రోడ్డుకి ఇరువైపులా మురికి కాలువలు నిర్మాణం చేపట్టాలని ప్రతి ఏరియాకి కూడా రెండు నుంచి మూడు గంటల దాకా మంచినీరు విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమాలలో సిపిఐ సిపిఎం నాయకులు విజయ్ భద్ర కుమార్ అశోక్ మల్లేష్ ప్రసాదు రాజశేఖర్ కృష్ణ సుధాకర్ శ్రీను అశోక్ మరి పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టెంకాయ మీద 620 సూక్ష్మ చిత్రాలు.





**నంద్యాల ప్రతినిధి. జూన్ 05 . (నంది పత్రిక ):**నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు కళారత్న చింతలపల్లె కోటేష్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని వినూత్నంగా టెంకాయ చుట్టూ 620 సూక్ష్మ చిత్రాలను మైక్రో బ్రష్ లతో, వాటర్ కలర్ పెయింటింగ్స్ తో అద్భుతంగా వేశారు. ఈ చిత్రాన్ని 6 గంటల సమయంలో వేసి మంచి సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ ఈ చిత్రంలో పర్యావరణం సమతుల్యంగా ఉంటే ఎలా ఉంటుందో చూపించాను. పర్యావరణం మార్పులు సంభవించి క్షామం (కరువు )ఎలా ఉంటుందో చూపించాను. పచ్చని చెట్లు, ప్రశాంత వాతావరణం, కొండలు, కోనలు, ఎగిరే గువ్వలు, పక్షులు, జంతువులు, పశువులు ఎంతో స్వేచ్ఛ గా వున్నట్లు, నది జలాలు, నీటిలో నివసించే జల చరాలు ఉన్నట్లు, ఇలాంటి ప్రకృతి సోయగాన్ని చూసి వనదేవత ఎంతో సంతోషంగా చిరునవ్వు తో వున్నట్లు వేసాను. అలాగే పర్యావణం బాగా లేకుంటే క్షామం ( కరువు )ఎంత భయంకరం గా వుంటుందో చూపించాను. ఎండిపోయిన చెట్లు, నరికి వేసిన చెట్లు, వన్య ప్రాణులకు చెట్లు లేక, నీడ లేక, నీరు లేక, ఆహారం లేక అలమటించి పోయి వనదేవత కు మొర పెట్టుకున్నట్లు, చనిపోయిన వన్య ప్రాణులు,మనుషులు ఇలా ఎన్నో మృత దేహాలు వున్నట్లు వీటిని చూసి వనదేవత కన్నీరు పెడుతూ చేతులు జోడించి మనుషుల్లారా ఇకనైన మారండి. పర్యావరణాన్ని కాపాడండి చెట్లను పెంచండి, ప్రతి నీటి చుక్కను వృధా కానీయకండి అని వేడుకున్నట్లు వేసాను. పర్యావరణం అనేది మన చుట్టూ వున్నా సహజ వాతావరణం ఇందులో గాలి, నీరు, భూమి, చెట్లు, పక్షులు, పశువులు, జంతువులు, మానవులు ఇలా అన్ని భాగమై వున్నాయి.ప్రతి ఒక జీవరాశికి పర్యావరణమే జీవన ఆధారం. కాని మనషులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పర్యావణాన్ని నాశనం చేస్తున్నారు.చెట్లను నరికివేస్తున్నారు.విపరీతంగా ప్లాస్టిక్ వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో భూమికి హాని కలిగిస్తున్నారు. ప్రతి సంవత్సరం 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు భూమ్మీద, నీటి మీద ప్రవేశిస్తున్నాయని పరిశోధకులు అంచనా వేశారు. వాతావరణంలో పెద్ద మార్పులు వచ్చింది. వేసవిలో ఇప్పుడు చూస్తున్న ఉష్ణగ్రత 45 డిగ్రీల నుండి 50 డిగ్రీల వరకు వస్తువుంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందో చూస్తున్నాం.అత్యంత వేడిమి తట్టుకోలేక ప్రపంచ వ్యాప్తంగా ఏడాదికి లక్షలాది మనుషులు చనిపోతున్నారు.ఈ సంవత్సరం మన భారత దేశంలో 30 వేల మంది పైగా మరణించారని అంచనా వేశారు.పర్యావరణం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి.ప్రజలు కూడా భాగస్వామి కావాలి. విపరీతంగా చెట్లు పెంచాలి. ప్రతి నీటి చుక్కను వృధా చేయకూడదు.పర్యావరణం పచ్చగా ఉంటేనే జీవన విధానం బాగుటుంది.ప్రతి సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వినూత్నంగా చిత్రాలు వేస్తూ వుంటాను ఈ సారి బొచ్చు వలచిన టెంకాయ మీద వేసాను.జూన్ 5 వ తేది ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం వేసాను.

# రసాయన రహిత వ్యవసాయమే జీవనాధారం



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 4:** కౌలు గుర్తింపు కార్డులతో రైతులకు సాగు హక్కులు ప్రయోజనాలు చేకూరుతాయని బండి ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. గురువారం పార్లపల్లి గ్రామంలో ధర్తీమాత బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో పవన్ కుమార్ మాట్లాడుతూ మండలంలో 1050 మంది కౌలు రైతులు ఉన్నారని వారు కౌలు గారు హక్కుల చట్టంపై కౌలు రైతులు భూ యజమానులు అవగాహన కలిగి అర్హులైన ప్రతి కౌలు రైతు ఆధార్ పట్టాదారు పాసుపుస్తకంతో సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బంది లేదా గ్రామ రెవెన్యూ అధికారి చే కౌలు గుర్తింపు కార్డు పొందవచ్చునని, గుర్తింపు కార్డుల వల్ల ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పొందడానికి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలు అమ్ముకోవడానికి పంట నష్టం వాటిలినప్పుడు నష్టపరిహారం పొందడానికి పంటల భీమాకు అర్హులవుతారని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో విజ్ఞప్తి చేశారు.

**రసాయనాలకు స్వస్తి పలకాలి..**

**సేంద్రీయ వ్యవసాయం చేయాలి**

జీవితంలో అత్యంత ప్రధానమైనది ఆహారం. ఆహార పంటలకు మూలం వ్యవసాయం. వ్యవసాయంలో రసాయనాలు ఉపయోగించకుండా పండించిన ఆహార ధాన్యాలు మనిషి మనుగడకు మూలం. వ్యవసాయంతో పాటు రకరకాల కూరగాయలు, ఆకుకూరలు,పండ్ల చెట్లు,ఔషధ మొక్కలు, చిరుధాన్యాలు,తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు పండించడం వ్యవసాయానికి అనుబంధం కావాలి. చిన్న సన్నకారు రైతులు సమూహాలుగా సహకార బృందాలుగా ఏర్పడి మోనోకల్చర్ వదిలి బహుళ పంటల వ్యవసాయానికి నాంది పలికితేనే రైతులు ఆర్థికంగా లబ్ధి పొందగలుగుతారని వ్యవసాయాధికారి పవన్ కుమార్ పేర్కొన్నారు. ధర్తీ బచావో, మాతా బచావో అభయాన్ కార్యక్రమంలో భాగంగా రైతులు సేంద్రియ వ్యవసాయం చేసి భూమి యొక్క ఆరోగ్యాన్ని పెంచాలని నీళ్లలో సేంద్రీయ గర్భం సూక్ష్మ పోషకాలు పెంపొందించాలని ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల వలన డ్రై షోయింగ్ పద్ధతిలో వరి సాగు చేసుకోవాలని ఏవో సూచించారు. తద్వారా నీరు, కూలి ఖర్చులు ఆదా అవుతాయని పేర్కొన్నారు. అనంతరం సబ్సిడీ పై జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్నపల్లె వ్యవసాయ విస్తరణ అధికారి పుష్పలత,పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్,నంద్యాల జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు నరసింహులు తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# బహిరంగంగా భూముల వేలం పాటలు



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 4 :** బండి ఆత్మకూరు మండలంలో దేవాలయ భూములు సంబంధించిన వేలంపాటలు కొనసాగుతున్నాయి. గురువారం సింగవరం గ్రామానికి సంబంధించిన వెంకటేశ్వర ఆంజనేయ స్వామి దేవస్థానములకు సంబంధించిన 41.06 దేవాలయ భూములను ఒక ఏడాదికి కౌలు నిమిత్తమై వేలం పాటలను నిర్వహించారు. ప్రస్తుత సంవత్సరం 14 లక్షల 66 వేలకు వేలంపాటలు జరగగా, గత సంవత్సరం 13 లక్షల ఏడు వేల రూపాయలకు వేలంపాటలు జరిగాయి. ప్రస్తుతం నిర్వహించిన వేలం పాటల్లో 1,59,000వేల రూపాయల ఆదాయం వచ్చింది. ఓంకార దేవస్థానమునకు సంబంధించిన 7.60 భూములకు వేలంపాటలు నిర్వహించారు. గత సంవత్సరం రెండు లక్షల 45 వేల రూపాయలు ఆదాయం రాగా, ఈ ఏడాది నిర్వహించిన వేలం పాటల్లో రెండు లక్షల 52 వేల రూపాయల ఆదాయం వచ్చింది. 7000 రూపాయల వరకు ఈ ఏడాది ఆదాయం పెరిగిందని తెలుస్తోంది. ఈ బహిరంగ భూముల వేలం పాటల నందు పర్యవేక్షణాధికారిగా వెలుగోడు గ్రూపు దేవస్థానంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జనార్ధన, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగప్రసాద్, దేవస్థానముల చైర్మన్లు శివ సాయి సంజన్న నాయుడు, అల్లె చెన్నారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు విజయ్ కుమార్,రామసుబ్బయ్య నబి రసూల్, నాగభూషణం, మల్లికార్జున,గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు. వేలంపాటలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

# ఏ బీ బర్దన్ కాలనీలో మూడు సంవత్సరాల పాటు స్థిర నివాసం ఉంటున్న పట్టించుకోని పాలక ప్రభుత్వాలు





## ఏ బీ బర్దన్ కాలనీ వాసుల పై హైకోర్టు ఆదేశాలను సైతం తుంగలో తొక్కిన గత ఇప్పటి రెవెన్యూ అధికారులు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వి. వీరశేఖర్ డిమాండ్

**బద్వేల్ జూన్ 4నంది పత్రిక :** బద్వేల్ నియోజకవర్గంలోని గోపవరం మండలం పి పి కుంట వద్దనున్న ఏపీ బర్దన్ కాలనీ ఏర్పడి ఇప్పటికి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్నప్పటికీ గత ప్రభుత్వం కానీ అధికారంలో ఉన్నటువంటి కూటమి ప్రభుత్వం గానీ ఆ కాలనీవాసులకు ఎలాంటి మౌలిక సదుపాయాలైనటువంటి మంచినీళ్లు కరెంటు సీసీ రోడ్లు వీధి దీపాలు ఇంటి పట్టాలు పక్కా ఇండ్లు ఏ ఒక్కటి కల్పించకపోవడం అటు వైసీపీ ప్రభుత్వం ఇటు కూటమి ప్రభుత్వం ఆ కాలనీ ప్రజలకు న్యాయం చేయడంలో పూర్తిగా విఫలం చెందాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏపీ బర్దన్ కాలనీ వాసులు సుమారు 200 మంది కలిసి గౌరవ విజయవాడ హైకోర్టు న్యాయవాదులను కలసి వారి బాధలు చెప్పుకోవడం వలన వారికి స్పష్టమైన ఉత్తర్వులను హైకోర్టు వారు కడప జిల్లా రెవెన్యూ అధికారులకు ఇవ్వడం జరిగింది.హైకోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ గోపవరం రెవెన్యూ అధికారులు ఆ ఉత్తర్వులను తుంగలో తొక్కి గత మూడు సంవత్సరాలుగా స్థిర నివాసం ఉంటున్న ఏపీ బర్దన్ కాలనీ వాసులను భయభ్రాంతులకు గురిచేసి వారిని అక్కడి నుండి ఖాళీ చేయించి భూ కబ్జాదారులకు ఆ స్థలాన్ని కట్టబెట్టి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకోవాలని గతంలో ఉన్నటువంటి రెవిన్యూ అధికారులు ఆ కాలనీవాసులపై ఉక్కు పాదం మోపి వారిని నిర్బంధాల గురిచేసి వారిపై కేసులు పెట్టి వారిని నానా ఇబ్బందులు పెట్టడం జరిగిందని అయినా ఆ ఇబ్బందులను లెక్కచేయకుండా పోరాటమే లక్ష్యంగా ఆ కాలనీవాసులు ఐక్యంగా ముందుకు సాగారని వారన్నారు.మరి ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆ ప్రభుత్వంలో పని చేస్తున్నటువంటి రెవెన్యూ అధికారులు తక్షణమే ఆ కాలనీకి మౌలిక సదుపాయాలైనటువంటి త్రాగునీరు కరెంటు సిసి రోడ్లు వీధి దీపాలు ఇంటి పట్టాలు పక్కా ఇండ్లు మంజూరు చేసి ఆ కాలనీవాసులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి వారు సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ ఏరియా సహాయ కార్యదర్శి పివి రమణ గోపవరం మండల కార్యదర్శి జి పెంచలయ్య జిల్లా సమితి సభ్యులు పొంగురు నాగరాజు శాఖ కార్యదర్శిలు ఎస్ వెంకటయ్య ఎన్ ఓబులేసు కమిటీ సభ్యులు గురయ్యా ఓబులమ్మ లక్ష్మమ్మ సుప్రజ సుబ్బరాయుడు శివ రాజేష్ పెంచలయ్య వెంకటేశు మరియు కాలనీవాసుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఉపాధ్యాయురాలు పాత్ర పోషించిన చైర్పర్సన్

**మర్రిపాడు జూన్ 04నంది పత్రిక :** మండల కేంద్రమైన శాఖ గ్రంథాలయం లో నిర్వహిస్తున్న వేసవిజ్ఞాన శిబిరాల ను నెల్లూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్పర్సన్ మేకపాటి శాంతి కుమారి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను వేమన పద్యాలు ఆవు పులి నీతి కథ, విఘ్నేశ్వరునికి విఘ్నాధిపత్యం లభించిన విధానం, పిల్లల చేతి వ్రాత విధానాన్ని పరీక్షించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు శీతల పానీయాలు ఫైవ్ స్టార్ చాక్లెట్లు అందజేసి పిల్లలను అభినందించారు అనంతరం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించి పుస్తక పఠనం గ్రంథాలయ ప్రాముఖ్యత అమ్మ భాష పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా విద్యార్థులు అందరూ కలిసి చైర్పర్సన్ ని శాలువాతో సత్కరించగా విద్యార్థులకు లైబ్రేరియన్ సమకూర్చిన బహుమతులను అందజేశారు. తదుపరి గ్రంథాలయ సభ్యత్వ దారుడు గ్రంథాలయ పుస్తకాలను చదివి డీఎస్సీలో ఉపాధ్యాయుడుగా ఎంపికై, యోగి వేమన యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అవార్డు పొందిన మర్రిపాడు నివాసి మాలపాటి మల్లెం కొండయ్యను అభినందించి శాలువాతో సత్కరించడం జరిగింది కార్యక్రమంలో గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు



## భరత్ రిటైర్మెంట్ ప్రకటించడంతో షాక్‌కు గురయ్యా: ఎంఎస్‌కే ప్రసాద్

అండర్-13 రోజుల నుంచి అతడిని చూస్తున్నానని వెల్లడి

టీమిండియా వికెట్ కీపర్, ఆంధ్రా క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ (కేఎస్ భరత్) అనూహ్యంగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 32 ఏళ్ల వయసులో తన కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు గురువారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించాడు. భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించడం తన జీవితంలో లభించిన గొప్ప గౌరవమని పేర్కొన్న భరత్, ఈ సుదీర్ఘ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన బీసీసీఐ, కోచ్‌లు.

# తాడేపల్లిగూడెం మండలం మారంపల్లి కి శాశ్వత రహదారికి కృషి చేస్తానని ప్రకటించిన కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ





## మారంపల్లి గ్రామ రహదారి నిర్మాణానికి భూమి కొనుగోలుకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ.10 లక్షల ఔదార్యం
## రైతులకు రూ.20 లక్షల అడ్వాన్స్ పంపిణీ

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 4నంది పత్రిక** తాడేపల్లిగూడెం మండలం మారంపల్లి గ్రామానికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణం కోసం అవసరమైన సహాయ సహకారాలను అందజేయనున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ప్రకటించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తన సొంత నిధుల నుండి రూ.10 లక్షలు అందించగా, గ్రామస్తుల విరాళాల రూపంలో మరో రూ.10 లక్షలు సమీకరించి మొత్తం రూ.20 లక్షలను భూమి నష్టపోతున్న ఆరుగురు రైతులకు అడ్వాన్స్‌గా అందజేశారు. భీమవరం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో గురువారం మారంపల్లి గ్రామ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. పీఎం గతి శక్తి పథకంలో భాగంగా మంజూరైన ఆర్ఓబీ-379 నిర్మాణం కారణంగా మారంపల్లి గ్రామానికి ప్రస్తుతం ఉన్న రాకపోకల మార్గం మూసివేయబడే పరిస్థితి నెలకొనడంతో గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను కేంద్ర మంత్రి మరియు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మారంపల్లికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణానికి సుమారు 1.20 ఎకరాల భూమి అవసరమవుతుందని రెవెన్యూ అధికారులు గుర్తించారు. అయితే ఈ భూమి 2016 సంవత్సరం నుండి 22(ఏ) జాబితాలో నమోదు కావడంతో సమస్య తలెత్తింది. సంబంధిత భూమి గ్రామ సముదాయ భూమిగా రికార్డుల్లో నమోదై ఉండటంతో దేవాదాయ శాఖకు చెందినదిగా పరిగణించబడుతోంది. అయితే ఈ భూమి తమ స్వంత భూమేనని, గత ప్రభుత్వం 22(ఏ)లో చేర్చిందని రైతులు పేర్కొంటూ 22(ఏ) తొలగించి తమ హక్కులను పునరుద్ధరించాలని అధికారులను కోరారు. ఈ విషయమై స్పందించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ భూమి వివరాలను ఎండోమెంట్స్ కమిషనర్‌కు పంపించి 22(ఏ) తొలగింపునకు అవసరమైన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ లోపు గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు రైతుల నుండి భూమి పొందడానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తన సొంత నిధుల నుండి రూ.10 లక్షలు, గ్రామస్తుల నుండి సేకరించిన విరాళాల రూపంలో మరో రూ.10 లక్షలు సమీకరించి మొత్తం రూ.20 లక్షలను ఆరుగురు రైతులకు అడ్వాన్స్‌గా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పీఎం గతి శక్తి పథకం కింద ఆర్ఓబీలు, ఆర్‌యూబీలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల కొన్ని గ్రామాల్లో రహదారి సమస్యలు తలెత్తుతున్నప్పటికీ వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మారంపల్లి సమస్యను స్థానిక ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకువచ్చారని, ప్రస్తుతం రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి 22(ఏ)లో ఉండటంతో జిల్లా కలెక్టర్ సీసీఎల్ఏకు ప్రతిపాదనలు పంపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. రహదారి నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణలో కూడా తనవంతు సహకారం అందిస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మారంపల్లి రహదారి సమస్యను ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకువచ్చారని, నూతన రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి ప్రస్తుతం 22(ఏ)లో నమోదై ఉండటంతో ఎండోమెంట్స్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించి 22(ఏ) తొలగింపునకు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత 50 నుండి 60 సంవత్సరాలుగా సరైన రహదారి సౌకర్యంలేక మారంపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా రైతులు పొలాల నుండి పంటలను తరలించేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్ఓబీ నిర్మాణంతో రైల్వే స్థలంలో సాగుతున్న రాకపోకలు కూడా నిలిచిపోతాయని, గ్రామానికి పూర్తిగా రహదారి లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణానికి భూమి సేకరణ చేపట్టినట్లు తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా, గ్రామ ప్రజలకు శాశ్వత రహదారి సౌకర్యం కల్పించేలా అన్ని విధాలా కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో తాడేపల్లిగూడెం తహసిల్దార్ టి.రాజరాజేశ్వరి, స్థానిక ప్రజాప్రతినిధి చిన్న బాబు, మారంపల్లి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు

## సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి
## వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో శిరివెళ్ల మండలంలో నిరసన ర్యాలీ
## ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శలు
## వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సిరివెళ్ల వైయస్సార్ పార్టీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ



**శిరివెళ్ల,(నంది పత్రిక):** కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు"కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్సీపీ అధ్యక్షులు శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం శిరివెళ్లలో పార్టీ నాయకులు,కార్యకర్తలు కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ,ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాయని,అయితే రెండేళ్లు పూర్తయినా వాటిలో చాలా వరకు అమలు కాలేదని విమర్శించారు. ప్రజలను మోసం చేసిన ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ర్యాలీలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్లు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు.

## రుద్రవరంలో వైఎస్ఆర్సిపి భారీ నిరసన ర్యాలీ.



**రుద్రవరం ప్రతినిధి జూన్ 04 (నంది పత్రిక):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికీఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందంటూ రుద్రవరంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు నిరసన గళం విప్పారు. వైఎస్ఆర్సిపి అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరియు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి (నాని) ఆదేశాల మేరకు గురువారం ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ర్యాలీలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు. స్థానిక హైస్కూల్ నుండి అమ్మవారి శాల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, తమ నిరసనను వ్యక్తం చేశారు. "వెన్నుపోటుకు రెండేళ్లు" అంటూ నినాదాలు చేస్తూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మోసపూరితమైన హామీలను నమ్మి ప్రజలు ఓటు వేస్తే, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని గంధం రాఘవరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల ఆశలను ఆశలను అడియాసలు చేస్తోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోని ప్రభుత్వం కూలిపోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు ప్రసాద్ రెడ్డి,, టి ఏ నరసింహారావు, హరి నారాయణ, డే గాని వెంకటేష్, జాకీర్ హుస్సేన్, పెద్దన్న,పాణ్యం చంద్ర, సవరం నాగ ముని, మాధవ, జయరాముడు, శూలం ప్రభాకర్, డిష్ భాస్కర్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి



## ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు ఆరోగ్యకర ఓటర్ల జాబితా కీలకం
## అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్లుగా తప్పక నమోదు చేయించాలి
## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీలు పూర్తి అవగాహన కలిగి ఉండాలి
## పారదర్శకంగా, సమర్థవంతంగా సర్వే నిర్వహణకు రాజకీయ పార్టీల సహకారం అవసరం
## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 4 నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా అత్యంత ముఖ్యమని తెలిపారు. జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లు లేకుండా, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడం మరియు అనర్హులైన పేర్లు తొలగించబడటం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

బూత్ లెవల్ అధికారులు ( బి ఎల్ ఓ లు ) తమ విధులను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, 2002 ఓటర్ల జాబితా మరియు 2025 తాజా జాబితాలను ఆధారంగా తీసుకుని మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కనీసం 95 శాతం సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, అవసరమైన ఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితర దరఖాస్తు పత్రాలను బిఎల్వోలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా వెయ్యి మంది ఓటర్లకు మాత్రమే పరిమితం ఉండేలా నిబంధనల ప్రకారం హేతుబద్ధీకరణ చేపట్టాలని తెలిపారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా చురుకుగా పాల్గొనాలని కోరారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం షెడ్యూల్‌ను వివరిస్తూ, జూన్ 5 నుండి 14 వరకు శిక్షణ మరియు ప్రింటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని చెప్పారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఓటరు నమోదుకు సంబంధించి అవసరమైన పత్రాలపై కూడా కలెక్టర్ వివరణ ఇచ్చారు. 01.07.1987కు ముందు జన్మించినవారు, 01.07.1987 నుండి 02.12.2004 మధ్య జన్మించినవారు, అలాగే 02.12.2004 తర్వాత జన్మించినవారికి వేర్వేరు ధృవపత్రాలు అవసరమవుతాయని తెలిపారు. జనన ధృవపత్రం, విద్యా ధృవపత్రాలు, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డు, ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డులు తదితర పత్రాలను వినియోగించవచ్చన్నారు.

ఇంటింటి సర్వే ద్వారా డూప్లికేట్ ఓటర్లు, మరణించినవారి పేర్లు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను సేకరించి జాబితా శుద్ధి చేపడతామని తెలిపారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువత, మహిళలు, దివ్యాంగులు, వలస కార్మికులు వంటి వర్గాల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ డాక్టర్ కె.సి.హెచ్. అప్పారావు, డిపిఓ వై.దోసి రెడ్డి, భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ.

## సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ.



**బద్వేల్ జూన్ 4 (నంది పత్రిక ):** పరిసరాల శుభ్రతతోనే దోమలను నివారించవచ్చుని, బద్వేల్ సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ అన్నారు. పట్టణంలోని కోటవీధి యూ పి హెచ్ సి పరిధిలో, గురువారం పలు వీధులలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం బ్యానర్ చేతపట్టి వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణ, మలేరియా నివారణ ,ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే పాటించాలి. దోమ పుట్టకూడదు, కుట్టకూడదు, పాటిద్దాం ,పాటిద్దాం, పరిసరాల శుభ్రత పాటిద్దాం, అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ, ఈ మలేరియా వ్యతిరేకం మాసోత్సవం కార్యక్రమం ఈనెల 30 వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు శుభ్రత, ఆరోగ్యం పై అవగాహన పరుస్తామన్నారు. రాబోయే రోజులలో దోమలు లేని ప్రదేశంగా మనమందరం తీసుకురావాలన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కోసం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల వద్దకే వైద్యం అందుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ వెంకటమ్మ ,హెల్త్ అసిస్టెంట్లు సొద్దల శ్రీరామయ్య, జనార్దన్ రావు, ఏఎన్ఎంలు, ఆశాలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఈ నెల 5 వ తేదీన పాణ్యం నియోజకవర్గంలో ఒక నెల- ఒక నియోజకవర్గం- 4 పర్యటనలు కార్యక్రమం 4 వ పర్యటన

## కర్నూలు నగరం మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో ప్రజల నుండి వినతుల స్వీకరణ
## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** ఈ నెల 5 వ తేదీన పాణ్యం నియోజకవర్గంలో ఒక నెల- ఒక నియోజకవర్గం- 4 పర్యటనలు కార్యక్రమం 4 వ పర్యటన కర్నూలు నగరం ఎస్ బి ఐ కాలనీ లోని మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో నిర్వహించడం జరుగుతోందని, ఈ కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఒక ప్రకటన లో తెలిపారు. 5 వ తేదీ ఉదయం 10 గంటల నుండి నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే, అధికారులు పాల్గొంటారని, కల్లూరు, ఓర్వకల్లు మండలాలు, నగర పరిధిలోని 16 వార్డ్ లలో ఉన్న ప్రజలు తమ సమస్యలను తెలుపుకోవచ్చుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# వైసీపీ కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదు, .





## వ్యక్తిగత ధూషణలకు స్వస్తిపలకండి, అభివృద్ధికి బాటలు వేయండి.. వైసీపీ

**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 4 ( నంది పత్రిక )** శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరులో వైసీపీ కార్యాలయం పై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు. తెలుగు దేశంపార్టీ అధికారం చేపట్టి 2 సంవత్సరాలు పూర్తి అయ్యింది, అయితే ఎన్నికల సందర్భంగా ప్రజలకు కూటమి ప్రభుత్వం ఉమ్మడి మేనిఫెస్టోను విడుదలచేసి అమలు చేస్తామని ఇచ్చిన వాగ్దానాలు హామీలను అమలు చేయలేదని, ప్రజలను వెన్నుపోటు పొడిచారని కాబట్టి ఈ మోసాలను, వెన్నుపోటు చర్యలను ప్రజలకు తెలియజేసేందుకు వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వెన్నుపోటుకు రెండేళ్లు అన్న కార్యక్రమాన్ని చేపడుతూ మేనిఫెస్టోను అన్ని నియోజకవర్గాలలో దహనం చేయడం జరిగిందన్నారు. గురువారం నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్రెడ్డి గృహంలో మాజీ ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించి టీడీపీ చేస్తున్న వ్యతిరేక విధానాలపై నేతలు మాట్లాడారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్రెడ్డి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ...శ్రీశైలం నియోజకవర్గంలో వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని అడ్డుకొనేందుకు టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ముందుగానే పథకం ప్రకారం ఆత్మకూరులో వైసీపీ కార్యాలయంపై దాడి చేయించి అతర్వాత మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆత్మకూరుకు వెళ్లకుండా చేయడం సరికాదని అన్నారు. జిల్లా ఎస్పీ ఈ విషయంపై ఆలోచించి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిన్న శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరులో వైఎస్ఆర్సిపి కార్యాలయంపై ఇంటిపై చేసిన దాడులపై , రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసం చేసిన కుట్రాళ్లపై అలాగే నేడు నిర్వహించిన వెన్నుపోటు కార్యక్రమం గురించి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై టిడిపి నాయకులు చేస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నాలుగే నాలుగు జరుగుతున్నాయని ఎక్సైజ్ శాఖ తాగమంటుంది..... పోలీస్ శాఖ ఊదమంటుంది...న్యాయశాఖ రమ్మంటుంది.. ఆర్థిక శాఖ ఫైన్ కట్టమంటుంది..... అంటూ తనదైన శైలిలో విమర్శలు చేశారు. అలాగే కొందరు టిడిపి నాయకులు ఇష్టం వచ్చినట్లు తాగడం , తూగడం , వాగడం పనిగా పెట్టుకున్నారని , ఇలాగే కొనసాగితే ఎవరు ఊరుకోరు అని సహనం కోల్పోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టిడిపి నాయకులకు హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యేలు శిల్పా రవి రెడ్డి మరియు శిల్పా చక్రపాణి రెడ్డి మట్లాడుతూ... ప్రశ్నిస్తే కేసులు, దాడులు పెడుతున్నారని అన్నారు. చేస్తూ ప్రజల దృష్టి మరల్చటానికి డైవర్ట్ పాలిటిక్స్ చేస్తూ మహానేత విగ్రహ ధ్వసం తాజాగా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరులో వైసీపీ కార్యాలయంపై టీడీపీ శ్రేణుల దాడి చేయడం, అలాగే వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు చేసిన మోసాలను వెన్నుపోటు గురించి ప్రజలకు తెలియజేసేందుకు శాంతియుతంగా నిరసన చేపట్టేందుకు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వెళ్తుంటే పోలీసులు గృహనిర్బంధం చేయడం జరిగిందని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన టీడీపీ వారిని అరెస్ట్ చేయాల్సి ఉండగా వైసీపీ వారిని నిర్బంధించడం సమంజసంగా లేదన్నారు. దాడుల సంస్కృతి ఎవరు మొదలు పెట్టారో గమనించాల్సి ఉందన్నారు. దుర్భాషలాడింది ఎవరు? దాడులు చేసింది ఎవరు? తెలుగు దేశం నాయకులకు ఒక్కటే చెబుతున్నాం...మీరు ఏవిధంగా మాట్లాడతారో.. అలాగే తాము వ్యవహరిస్తామని, వెనకడుగు వేసే ప్రసక్తేలేదన్నారు. దాడులు చేస్తే భయపడం, కేసులకు భయపడం, జైల్లో పెడితే భయపడం మేము కూడా వడ్డీతో సహాచెల్లిస్తామని హెచ్చరించారు. ఇస్సాక్ బాష మాట్లాడుతూ... టీడీపీ ప్రభుత్వం త్రికరణశుద్ధిగా ఇచ్చిన హామీలను, వాగ్దానాలను నెరవేర్చలేదన్నారు. చేసిన మోసాలను ప్రజలకు తెలియజేస్తూ టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టో పత్రాలను దహనం చేయడం జరిగిందన్నారు. దివంగత డా. వైస్సార్ విగ్రహం ధ్వంసం చేసిన ఘటనలో జంబులయ్య మానసిక రోగి అని చెబుతూ ఘటన జరిగిన కొద్ది సమయంలోనే టీడీపీ నాయకులు చేయడం అతను వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేయడం అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. స్టేషన్కు వెళ్లేలోపే జంబులయ్య కు చెందిన మెడికల్ రిపోర్టు పోలీస్ అధికారుల టేబుల్ మీదకు రావడం గమనించామన్నారు. అయితే ఈ వ్యక్తి టీడీపీ నేతలతో, జనసేన నేతలతో దిగిన ఫోటోలు బహిర్గతం చేయడం జరిగిందన్నారు. టీడీపీ నాయకులు వైసీపీ నేతలను అనవసరంగా దిగజారి మాట్లాడటం తగదన్నారు.

ప్రజలు గమనిస్తుంటారన్నారు. ఇటువంటి విధానాలకు స్వస్తిపలకాలని, అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలని కోరారు. వ్యక్తిగత ధూషనల వద్దన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు పి.పి. మధుసూదన్ రెడ్డి, మీది వేముల ప్రభాకర్ రెడ్డి, నంద్యాల నియోజకవర్గ పరిశీలకుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి , నారాయణరెడ్డి , మైనార్టీ నాయకులు యూనుస్ బాష , మహిళ రాష్ట్ర నాయకురాలు శశికళ రెడ్డి తదితరులు పాల్గొన్నారు...





# పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్!

## పంపిణీకి సిద్ధం చేస్తున్న విద్యాశాఖ అధికారులు



**జూపాడుబంగ్లా: జూన్: 4: (నంది పత్రిక )** పాఠశాలలో ప్రారంభించిన తొలిరోజే విద్యార్థులకు ఉచితముగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలన్న లక్ష్యముతో ప్రభుత్వం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండలంలోని 12 గ్రామపంచాయతీలు పరిధిలోని 38 ప్రభుత్వ పాఠశాలలో ఉన్నాయి. వీటిలో దాదాపు 3656 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పేరుతో అవసరమైన పాఠ్యపుస్తకాలు 20101 వేల వరకు ప్రత్యేక బస్సు లో మండలానికి చేర్చారు. వీటిని జూపాడుబంగ్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భద్రపరిచి అక్కడ నుంచి పాఠశాలలకు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ లక్ష్యముగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఏడాది పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో తన పిల్లలను చేర్పించేలా చర్చించుకున్నట్లు సమాచారం. లక్ష్యం ఏంటి? విద్యార్థులకు అవసరమైన విద్యాసామాగ్రిని అందించి చదువుకు చేత ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం, డిక్షనరీలు కొత్త పదాలు నేర్చుకోవడానికి యూనిఫాంలు విద్యార్థులలో సమానత్వం పెంపొందించడానికి తోడ్పడ్డాయి.

**మొదటి రోజే విద్యార్థుల చేతిలో పాఠ్యపుస్తకాలు.. ఎంఈఓ చిన్న మద్దిలేటి** గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పాఠశాలలు పున: ప్రారంభమయ్యే జూన్ 12వ తేదీ మొదటి రోజే పాఠ్యపుస్తకాలు అందించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నాము. గ్రామాల్లో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యామిత్ర సామాగ్రి, మౌలిక సౌకర్యాలు గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో పిల్లల్ని చేర్పి సంపూర్ణ సహకారం అందించాలి.

# నరసాపురంలో పి ఎం డి ఎస్ షోయింగ్ కార్యక్రమం.



**రుద్రవరం ప్రతినిధి జూన్ 04 (నంది పత్రిక):** రుద్రవరం మండలం నరసాపురం గ్రామంలో ఏపీ సీ ఎన్ ఎఫ్ క్యాంపెయిన్ లో భాగం గా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మరియు మండల వ్యవసాయ అధికారినీ ఆధ్వర్యంలో గ్రామం లోని 5 మంది రైతు ల తో 6 ఎకరాల విస్తీర్ణం తో 30 రకాల విత్తనాల తో విత్తన గుళికలు తయారు చేసి పిఎండిఎస్ షోయింగ్ కార్యక్రమం వ్యవసాధికారి సుమతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా నర్సాపురం గ్రామంలో నీ రైతులు ప్రసాద్ 1.00 ఎకరాలు,భాష 1.00 , ఎకరాలు సునీల్ కుమార్ 2.00 , ఎకరాలు, వై శివ 1.00 ఎకరాలు, రుద్రవరం రైతు సూర్య నారాయణ రెడ్డి 1.00 ఎకరాలు మొత్తం 6 ఎకరాల విస్తీర్ణంలో పిఎండిఎస్ సోయింగ్ చేపించడం జరిగింది .ఈ కార్యక్రమంలో డిపిఎం శ్రీనివాసులు, డివిజన్ ఏంటి రామాంజనేయ రెడ్డి సునీల్ కుమార్, శివ శంకర్,గౌరీ, వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

# ఓటురు లీస్టు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేయండి

- తహసిల్దార్ ఉమారాణి



**కొత్తపల్లి – నంది పత్రిక :** గ్రామాలలో సచివాలయ సిబ్బంది, బీఎల్డలతో కలసి ఓటరు లీస్టు మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. గురువారం మండలంలోని ఎర్రమఠం సచివాలయాన్ని ఆకస్మీక తనిఖీ చేశారు. ముందుగా హాజరు రిజిస్టరు, మూమెంట్ రిజిస్టర్, ఇతర రిజిస్టర్లను తనిఖీ చేశారు. అదేవిధంగా సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. గ్రామాలలో జరుగుతున్న ఓటరులీస్టు మ్యాపింగ్ ప్రక్రియను ఏవిధంగా చేయాలి. ఎంతసమయంలో చేయాలి. ఏలా చేయాలి అన్న విషయాలను సిబ్బందికి వివరించారు. 2002 ఓటరు లీస్టుతో ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితా ఏలా సరిపోల్చాలి అన్న విషయాలను క్షుణ్ణంగా వివరించి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.



# ఆకాశమే హద్దుగా అగ్నివీర్ వాయుగా ఎంపికైన రుద్రవరం మోడల్ స్కూల్ విద్యార్థి మహీధర్ యాదవ్.

**రుద్రవరం ప్రతినిధి జూన్ 04 (నంది పత్రిక):** ఏపీ మోడల్ స్కూల్, రుద్రవరం విద్యార్థి మహీధర్ యాదవ్ 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఈ విద్యాసంస్థలోనే విద్యను అభ్యసించారు. తన కృషి, పట్టుదల, క్రమశిక్షణ మరియు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో విద్యా రంగంలో విశేష ప్రతిభ కనబరిచి, ప్రస్తుతం అగ్నివీర్ వాయు ద్వారా భారత వైమానిక దళం ఇండియన్ ఆర్మీలోలో ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.ఈ సందర్భంగా మహీధర్ యాదవ్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు హృదయపూర్వకంగా అభినందించారు. ఆయన సాధించిన ఈ విజయం పాఠశాలలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.మహీధర్ యాదవ్ ఈ నెల 25వ తేదీన విధుల్లో చేరనున్నట్లు తెలిపారు. ఆయన దేశ సేవలో అత్యుత్తమంగా రాణించి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాఠశాల కుటుంబం ఆకాంక్షించింది.అలాగే, బి నాగిరెడ్డి పల్లె కి చెందిన మహీధర్ యాదవ్ తల్లిదండ్రులు లింగ మూర్తి , వాణిశ్రీ తమ



కుమారుడిని క్రమశిక్షణతో పెంచి, విద్యాభ్యాసంలో ప్రోత్సహించి ఈ విజయానికి బలమైన పునాది వేశారు. వారి సహకారం వల్ల విద్యార్థి మాత్రమే కాకుండా పాఠశాలకు కూడా మంచి గుర్తింపు, గౌరవం లభించిందని ప్రిన్సిపాల్ ప్రశంసించారు.

మహీధర్ యాదవ్ సందేశం: “నా విజయానికి కారణమైన నా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మరియు ఏపీ మోడల్ స్కూల్ రుద్రవరం కుటుంబానికి, బి.నాగిరెడ్డి పల్లె అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. చిన్నప్పటి నుండి దేశ సేవ చేయాలనే నా కల నేడు అగ్నివీర్ వాయుగా ఎంపిక కావడంతో సాకారమైంది. కష్టపడి లక్ష్యంపై దృష్టి పెడితే ఏదైనా సాధించవచ్చని నేను నమ్ముతున్నాను. నా లాంటి విద్యార్థులందరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ కలలను నిజం చేసుకోవాలని కోరుకుంటున్నాను. దేశ సేవలో అంకితభావంతో పనిచేసి మా పాఠశాలకు, తల్లిదండ్రులకు, నా గ్రామం బి. నాగిరెడ్డి పల్లె కి, రుద్రవరం మండలం లో ఉన్న అందరికీ మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తాను.

## వెన్నుపోటు చంద్రబాబు నైజం

**కొత్తపల్లి – నంది పత్రిక:** వెన్నుపోటు చంద్రబాబు నైజం అని, నాడు మామ అయిన ఎన్టీ రామారావును, నేడు రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచాడని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్రెడ్డిలు అన్నారు. గురువారం వెన్నుపోటుకు రెండేళ్ళు కార్యక్రమం నిర్వహించారు. ఇందులోభాంగా ముందుగా దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్రెడ్డి, విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం డౌన్. డౌన్, ఇచ్చిన హామీలు నేరవేర్చాలి. వెన్నుపోటు సీఎం డౌన్డౌన్ అంటూ నినాదాలు చేస్తూ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ గాంధీ విగ్రహాంకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇంటలెక్చువల్ ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మెన్ రామ సుబ్బారెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ నాగలక్ష్మి రెడ్డి, పబ్లిసిటీ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు రహమతుల్లా, కో ఆప్టెడ్ మెంబర్ షేక్ మొహమ్మద్ గౌస్. బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి రవీంద్రారెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు పరశురాముడు. యువజన విభాగం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీటీసీలు శివన్న, బాలరాజు, మాజీ సర్పంచ్ బాల ఎల్లయ్య. వైఎస్ఆర్సిపి నాయకులు ఎస్. రవీంద్రారెడ్డి, రామిరెడ్డి, బాబు రెడ్డి, లోకేశ్వర్రెడ్డి, సిహెచ్ రమేష్ బాబు, భగవాన్ రెడ్డి, రామకృష్ణ, రఘుస్వామి రెడ్డి, అచ్చిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చింతమాను శ్రీను వాసులు యాదవ్, రమణయ్య, రాజ్ కుమార్, సురేష్ బాబు,జయన్న, వైఎస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### పారిశుద్ధ్య కార్మికులకు కమిషనర్ చల్లా ఓబులేసు సూచన

### పారిశుద్ధ్యంలో షరీన్ నగర్ కార్మికులు భేష్



**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు విధులను నిబద్ధతతో నిర్వర్తిస్తూనే కుటుంబ సభ్యుల సంక్షేమం, పిల్లల ఉన్నత విద్య, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. గురువారం ఆయన కృష్ణనగర్ ఐటీసీ సర్కిల్, షరీన్ నగర్, చెన్నమ్మ సర్కిల్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. షరీన్ నగర్‌లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించబడుతుండటం, కార్మికులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించడంపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ పనిచేస్తున్న శానిటేషన్ కార్యదర్శులను, కార్మికులను అభినందించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కమిషనర్ ఆప్యాయంగా మాట్లాడారు. వారి కుటుంబ యోగక్షేమాలు, పిల్లల విద్యాభ్యాసం, ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విధులు ముగిసిన అనంతరం కుటుంబ సభ్యులతో సమయం గడపాలని, పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మంచి విద్య ద్వారానే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు కల్పించవచ్చని పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో పైస్థాయి అధికారుల సహకారం తీసుకోవాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని, విధి నిర్వహణ సమయంలో అనవసరంగా కాలయాపన చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. కృష్ణనగర్ ఐటీసీ సర్కిల్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో కొన్ని టీ బంకుల వద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయకపోవడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత వ్యాపారులకు జరిమానాలు విధించాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, అనిల్ కుమార్, మల్లికార్జున, ఏ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ గూడూరు మండల అధ్యక్షుడు కురువ వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ నాయకులు



**కర్నూల్ ప్రతినిధి నందిపత్రిక** భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ సూచన మేరకు కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం బీజేపీ పార్టీ గూడూరు మండల అధ్యక్షుడు కురువ వెంకటేష్ గడ్డివాములు దగ్ధం కావడం అత్యంత బాధాకరమని కోడుమూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ , బీజేపీ కిసాన్ మోర్చా కర్నూలు జిల్లా అధ్యక్షుడు కురువ బసవరాజు తెలిపారు. గురువారం కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం గూడూరు మండలం పొన్నకల్ గ్రామంలోని కురువ వెంకటేష్ నివాసానికి వెళ్లిన వారు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కురువ బసవరాజు బాధిత కుటుంబానికి రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు పరిగెల మురళీకృష్ణ, తుగ్గలి నవీన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామాల్లో ఇటువంటి దుర్ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. రైతుల ఆస్తులకు నష్టం కలిగించే ఘటనలను ప్రభుత్వం, పోలీసులు అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని, ఈ ఘటనకు బాధ్యులైన వారెవరైనా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# హామీలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం





### వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం

### వెన్నుపోటుకు రెండేళు

### లిప్యాపిలిలో నిరసన ర్యాలీ

### కూటమి ప్రభుత్వ మేనిఫెస్టో ప్రతుల దహనం

### హామీలు నెరవేర్చకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవని హెచ్చరిక

**నందిపత్రిక–ప్యాపిలి** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా తుంగలో తొక్కిందని వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం పిలుపు మేరకు.. 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరిట గురువారం ప్యాపిలి మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ, ప్రధాన వీధుల గుండా సాగుతూ అంబేద్కర్ విగ్రహం వరకు చేరుకుంది. ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం, ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో ప్రతులను రోడ్డుపై దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

**సూపర్ సిక్స్ కాదు.. సూపర్ ఫాల్స్ హామీలు!**

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మెట్టు వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి బొర్రా మల్లిఖార్జున రెడ్డి, మండల కన్వీనర్ పోతుదొడ్డి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, మస్తాన్ ఖాన్, కొండయ్య మాట్లాడుతూ.. "కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీల పేరుతో ప్రజలను నమ్మించి, ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చింది. తీరా గద్దెనెక్కి రెండేళ్లు గడుస్తున్నా ఆ హామీల ఊసే ఎత్తడం లేదు. ఇది ప్రజాస్వామ్యాన్ని, ప్రజల నమ్మకాన్ని వెన్నుపోటు పొడవడమే" అని ఆరోపించారు.

**అర్హులందరికీ అన్యాయం:** వైఎస్సార్‌సీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై పలు డిమాండ్లతో విమర్శలు గుప్పించారు: పెన్షన్ల ఎగనామం: బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పి మాట తప్పారు. మహిళలకు మోసం: 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఇస్తామన్న 'ఆడబిడ్డ నిధి' హామీని ఇప్పటి వరకు అమలు చేయలేదు. యువతకు నిరుద్యోగ భృతి: ఉద్యోగాలు కల్పించకపోగా, నిరుద్యోగ భృతి ఇవ్వడంలోనూ ఈ ప్రభుత్వం పూర్తిగా అట్టర్ ఫ్లాప్ అయింది.

**రాబోయే రోజుల్లో పోరుబాట:**

కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి తాము ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని, లేని పక్షంలో ప్రజా క్షేత్రంలోనే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని నేతలు హెచ్చరించారు. హామీల సాధన కోసం రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బోరెడ్డి రాము, బషీర్, రజని, ప్రభాకర్ రెడ్డి, విగ్గు, సాగర్, పెద్దిరాజు, వెంకటేశు, రామ్మూర్తి, నాగరాజు, రంగనాయకులు, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి - ఎస్ టి యు డిమాండ్.




**పోరుమామిళ్ల జూన్ 4 (నంది పత్రిక ):** ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం మాట తప్పిందని ఎస్ టి యు – రాష్ట్ర కౌన్సిలర్ కె. పుల్లయ్య,జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ బి. బాలరాజు విమర్శించారు. గురువారం సాయంత్రం ఎస్ టి యు – ప్రాంతీయ కార్యాలయం పోరుమామిళ్ల లో ఆ సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రతిపక్ష హోదాలో కూటమి పెద్దలు తాము అధికారంలోకి వస్తే 12వ పిఆర్సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఆర్థిక బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లిస్తామని, డిఏ లను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లయినా హామీల అమలులో చిత్తశుద్ధి కనపరచడం లేదన్నారు. పిఆర్సీ గడువు ముగిసి ఇప్పటికే మూడేళ్లయిందని, పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేయడంలో తీవ్ర తాత్సారం చేస్తున్న దృష్ట్యా మధ్యంతరబృతి వెంటనే 30%ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం రివర్స్ పిఆర్సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఆర్థిక బకాయిలపై రోడ్ మ్యాప్ ప్రకటించి నిర్ణీత గడువులోగా బకాయిలను చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్నామని ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోతే పోరాటమే శరణ్యమన్నారు పాలకవర్గాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా, అధికారపక్షంలోకి రాగానే మరోరకంగా వ్యవహరించడం తగదన్నారు. ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జూన్ మాసంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఛలో సెక్రటేరియట్ నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు – నాయకులు జి. శ్రీనివాసులు, మూలా రామకృష్ణారెడ్డి, కె. వెంకటసుబ్బయ్య,బి.బాష, డి ఎల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అద్దె చెల్లించని మున్సిపల్ షాపులు సీజ్





### అద్దె చెల్లించని దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశం

**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** నగరపాలక సంస్థకు చెందిన షాపులను లీజుకు తీసుకుని అద్దెలు చెల్లించకుండా బకాయిలు పెంచుతున్న దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వాటిని సీజ్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. గురువారం ఆయన కల్లూరు, రైల్వే స్టేషన్, ఎన్ఆర్ పేట, కొత్తపేట ప్రాంతాల్లో ఉన్న మున్సిపల్ షాపులను పరిశీలించారు. కొంతమంది లీజుదారులు షాపులను ఇతరులకు అద్దెకు ఇచ్చి అధిక మొత్తంలో వసూలు చేసుకుంటూ, కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన అద్దెలను నిర్లక్ష్యం చేయడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ విధానం సరైనది కాదని లీజుదారులను హెచ్చరించారు.

ప్రతి నెల 10వ తేదీలోపు అద్దెల వసూళ్లు పూర్తి చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. కార్పొరేషన్ నిర్వహణ వ్యయాలు, ప్రజా సేవల నిర్వహణకు అద్దె ఆదాయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. అద్దెల చెల్లింపులో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. మొండి బకాయిదారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని, అవసరమైతే షాపులను సీజ్ చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా కమిషనర్ సెట్కూర్ కార్యాలయం సమీపంలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. అక్కడ అల్పాహారం చేస్తున్న ప్రజలతో మాట్లాడి ఆహార నాణ్యత, పరిశుభ్రత, సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ నిర్వహణ, పరిశుభ్రత పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్వోలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆర్ఐలు రాజు, భార్గవ్, శానిటేషన్ ఇంస్పెక్టర్ కుర్మయ్య, అడ్మిన్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ జన్మదిన వేడుకలు

### ప్యాపిలిలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు



**నందిపత్రిక–ప్యాపిలి** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు యాదవ్ జన్మదిన వేడుకలను ప్యాపిలి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుల మధ్య కేక్ కట్ చేసి, నాగేశ్వరరావు యాదవ్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీటీసీ రామ్మోహన్ యాదవ్, తెలుగుదేశం పార్టీ ప్యాపిలి మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు రాంపురం నాగేశ్వరరావు, తెలుగు యువత నాయకులు కోదండరామయ్య యాదవ్, ఆర్సీ మద్దిలేటి, కంబగిరి రాముడు, ఓబులేసు, వెంగళంపల్లి రమేష్ యాదవ్, బలరాముడు పాల్గొన్నారు.

## తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం

:తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు హుజూరాబాద్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో గాలి దుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ములుగు జిల్లా మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. కాలనీలకు కాలనీలు నీట మునిగిన పరిస్థితి ఉంది. సుభాష్ నగర్, ఆదర్శనగర్ కాలనీలు జలమయం కావడంతో ఇళ్లలోకి వరద నీరు చేరింది. స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ సహాయక చర్యలు చేపట్టారు. ప్రొ÷–లకెయినర్ల సహాయంతో డ్రైనేజీలు క్లీన్ చేయించి వరద నీరు వెళ్లేలా చర్యలు

తీసుకున్నారు. కరీంనగర్ నగరంలో కురిసిన భారీ వర్షానికి కట్టరాంపూర్ నాగన్న చౌరస్తా దగ్గర ఓ ఇంటి ప్రహరీ కూలింది. గోడతో పాటు పక్కనే ఉన్న భారీ వృక్షం కూడా నేలకొరిగింది. అటుగా నిలిపి ఉన్న కారుపై శిథిలాలు పడటంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. భారీ ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు పడుతున్న క్రమంలో.. పాత గోడలు, భారీ వృక్షాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షానికి పక్కనే ఉన్న డ్రైనేజీ పొంగి కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రాంగణం అంతా జలమయమైంది. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్?లో పిడుగు పడింది. మొబైల్?తో వర్షాన్ని రికార్డ్ చేస్తుండగా స్థానికుడు పిడుగుపాటుతో ఉలిక్కిపడ్డాడు.

## ఎపిలో పలు జిల్లాల్లో వర్షాలు

### నేడు కూడా వర్షాలు కురిసే అవకాశం

ఏపీలో గురువారం పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. సాయంత్రం ఐదు గంటల సమయానికి పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంటలో 30.5 మి.మీ., గుంటూరు జిల్లా తాడేపల్లిలో 27.2 మి.మీ., అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 18.5మి.మీ., విజయనగరం జిల్లా గుర్లలో 14.5 మి.మీ. వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దక్షిణ తెలంగాణ, దానిని ఆనుకొని ఉన్న కోస్తాంధ్ర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో శుక్రవారం పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, తదితర జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 44.7 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో 43.8, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 43.7, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 43.6, కృష్ణా జిల్లా కంకిపాడులో 43.4, ప్రకాశం జిల్లా కొండపిలో 43, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో, నెల్లూరు జిల్లా గూడూరులో 44 డిగ్రీలు, కృష్ణా జిల్లా పెదపారుపూడి, పల్నాడు జిల్లా అమరావతిలో 43.4, కంచికచర్లలో 43.2, గుంటూరు జిల్లా రాయపూడిలో 43, ప్రకాశం జిల్లా చీమకుర్తిలో 42.7, తిరుపతి జిల్లా బోనుప్లలెలో 42.4, విజయనగరం జిల్లా రాజాంలో 42.3, ఏలూరు జిల్లా కలపర్రులో 42.3, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం, ఏలూరు జిల్లా అల్లిపల్లి, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం, అని వెల్లడించింది.

# ప్యాంక్రియాటిక్ శస్త్రచికిత్స చేసిన రోగికి అరుదైన లాపరోస్కోపిక్ విప్పుల్ శస్త్రచికిత్స విజయవంతం

**హైదరాబాద్ నంది పత్రిక బ్యూరో**....గతంలో పాంక్రియాటిక్ శస్త్రచికిత్స జరిగిన వ్యక్తికే అరుదైన లాపరోస్కోపిక్ విప్పుల్ సర్జరీ చేసి ఊరట కల్పించారు కిమ్స్ హాస్పిటల్స్ కొండాపూర్ వైద్యులు. ఇందుకు సంబంధించిన వివరాలను శస్త్రచికిత్స చేసిన క న్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా. సిహెచ్. నవీన్ కుమార్. హైదరాబాద్ నగరానికి చెందిన ఓ 52 ఏళ్ల మహిళల గతంలో క్రానిక్ కాల్సిఫిక్ ప్యాంక్రియాటిటిస్‌కు ఓపెన్ శస్త్రచికిత్స చేయించుకున్నారు. అదే రోగికి ఇప్పుడు లాపరోస్కోపిక్ విప్పుల్ సర్జరీ చేసి ప్రాణాలు కాపాడామని తెలిపారు. ఇప్పటికే లేటరల్ ప్యాంక్రియాటికోజేజునోస్టమీ శస్త్రచికిత్స చేయించుకున్న ఈ రోగి, పచ్చకామెర్లు (జాండిస్) మరియు వాంతులతో ఆసుపత్రికి వచ్చారు. సమగ్ర పరీక్షల అనంతరం, ప్యాంక్రియాస్‌లో మిగిలిన రాళ్లు (రిమ్నెంట్ ప్యాంక్రియాటిక్ స్టోన్స్) మరియు డ్యూడెనమ్‌లో అడ్డంకి (డ్యూడెనల్ అబ్స్ట్రక్షన్) ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీనితో మరొక శస్త్రచికిత్స అవసరమైంది. మునుపటి ఓపెన్ శస్త్రచికిత్స కారణంగా శరీర నిర్మాణంలో మార్పులు రావడం, అంటుకునే కణజాలం (అడ్హీజన్స్) ఏర్పడటం వంటి సమస్యలు ఉండటంతో ఈ శస్త్రచికిత్స అత్యంత క్లిష్టంగా మారింది. అయినప్పటికీ, మినిమల్లి ఇన్వేసివ్ విధానాన్ని ఎంచుకుని లాపరోస్కోపిక్ విప్పుల్ శస్త్రచికిత్స (ప్యాంక్రియాటోడ్యూడెనెక్టమీ)ను విజయవంతంగా పూర్తి చేశాం. మునుపటి ప్యాంక్రియాటిక్ శస్త్రచికిత్సలు చేసిన రోగుల్లో తిరిగి లాపరోస్కోపిక్ విప్పుల్ శస్త్రచికిత్స చేయడం అత్యంత అరుదైన విషయం. శరీర నిర్మాణంలో మార్పులు, అంటుకునే కణజాలం, శస్త్రచికిత్స మార్గాల మార్పులు వంటి కారణాల వల్ల ఇలాంటి శస్త్రచికిత్సలు చాలా సవాలుగా ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంలో, రోగి శరీర నిర్మాణానికి అనుగుణంగా గ్యాస్ట్రోఇంటెస్టినల్ కంటిన్యూయిటీని కొనసాగించేందుకు వైద్యులు ఒక కొత్త విధానంలో రీకన్స్ట్రక్షన్ చేపట్టారు. ఈ నవీన విధానం శస్త్రచికిత్స విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించింది. మునుపటి ఓపెన్ ప్యాంక్రియాటిక్ శస్త్రచికిత్స తరువాత లాపరోస్కోపిక్ విధానంలో తిరిగి ఆపరేషన్ చేయడం చాలా అరుదైనది. దీనికి ఖచ్చితమైన ప్రణాళిక, ఉన్నత స్థాయి నైపుణ్యం, ఆపరేషన్ సమయంలో తక్షణ నిర్ణయాలు అవసరం," అని తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యంగా కోలుకొని, వారం రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం ఆమె స్థితి స్థిరంగా ఉండి, ఫాలోఅప్‌లో బాగానే ఉన్నారు. మునుపటి శస్త్రచికిత్స చేసిన రోగిలో లాపరోస్కోపిక్ విప్పుల్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించిన ఈ ఘటన చాలా అరుదైనది పేర్కొన్నారు. ఇది మినిమల్లి ఇన్వేసివ్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ శస్త్రచికిత్సల్లో సాధించిన పురోగతిని ప్రతిబింబిస్తోంది.



# ఆళ్లగడ్డలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### "వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ



**నంద్యాల బ్యూరో, జూన్ 04(నంది పత్రిక):–** "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా నేడు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతారని కలెక్టర్ తెలిపారు. అలాగే గత మూడు వారాలుగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో స్వీకరించిన వినతులపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలకు సంబంధించిన ఎండార్స్‌మెంట్ కాపీలను అర్జీదారులకు అందజేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# కూటమి ప్రభుత్వ నయవంచనకు రెండేళ్లు.. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే!

### టీడీపీ ఆఫీసుకు రాత్రికి రాత్రే స్థల సేకరణ.. నిరుపేదల దరఖాస్తులు మాత్రం బుట్టదాఖలా!

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె రామాంజనేయులు

**నంద్యాల ప్రతినిధి. జూన్ 05 . (నంది పత్రిక ):**ఎన్నికల ముందు ఆకాశమే హద్దుగా హామీలిచ్చి, అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా నిరుపేదల ఇళ్ల స్థలాల ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వైఖరిపై వామపక్షాలు, ప్రజా సంఘాలు సమరశంఖం పూరించాయి. గురువారం నంద్యాల పట్టణంలోని సాయిబాబా నగర్ సీపీఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ అధ్యక్షతన అఖిలపక్ష, వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కె రామాంజనేయులు మాట్లాడుతూ.. నంద్యాల పట్టణంలో వార్డు సచివాలయాల ద్వారా సుమారు 4 వేల పైచిలుకు లబ్ధిదారులతో దరఖాస్తులు చేయించగా, అందులో 2,400 మంది నిరుపేదలు ఇళ్ల స్థలాలకు అర్హత సాధించారని తెలిపారు. ఎన్నికల హామీలు ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఈ నిరుపేదలకు ఒక్క గజం స్థలం కూడా ఇవ్వని ప్రభుత్వం, అధికార పార్టీ జిల్లా కార్యాలయానికి మాత్రం రాత్రికి రాత్రే స్థల సేకరణ పూర్తి చేసి జీవోలు జారీ చేసుకోవడం సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. రంగా నాయుడు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహాలో పేదలకు శఠగోపం పెడుతూ, అధికార పార్టీ నేతలు ప్రభుత్వ భూములను లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. నంద్యాల పట్టణంలో గత 10 ఏళ్లుగా పేదలకు స్థలాల పంపిణీ ఊసే లేదని, పెరిగిన జనాభాకు తోడు, నిలువ నీడ లేక ఒకే చిన్న ఇంట్లో రెండు మూడు జంటలు కాపురం చేస్తూ నరకప్రాయంగా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒకటొకటి నెరవేరుస్తుందని అన్నారు సిపిఎం జిల్లా నాయకులు నరసింహ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలం సరిపోదంటూ నాటి ఎన్నికల ప్రచారంలో గగ్గోలు పెట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తూ పేదలను ఘోరంగా వంచిస్తున్నారని విమర్శించారు. సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు చౌడప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని, ఇందులో భాగంగా పట్టణ ప్రాంతాలలో ప్రతి నిరుపేద కుటుంబానికి రెండు సెంట్ల ఇంటి స్థలం, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్ల ఇంటి స్థలం కేటాయించడంతో పాటు, ఇంటి నిర్మాణ ఖర్చుల కోసం ప్రభుత్వమే రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. వైస్సార్సీపీ నాయకులు రసూల్ ఆజాద్, సన్నల సాయిరాం రెడ్డి మాట్లాడుతూ గతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను సైతం మౌలిక వసతులు కల్పించి తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా కాలయాపన చేస్తోందని, వేలాది కోట్లు ఖర్చు చేసిన పేదల ఇళ్లు నేడు భూత్ బంగ్లాలగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు పేదలకు స్థలాలు ఇవ్వడానికి భూమి లేదంటున్న ప్రభుత్వం, మరోవైపు చాబోలు గ్రామంలో ప్రభుత్వ భూములను అధికార పార్టీ నాయకులు యథేచ్ఛగా ఆక్రమిస్తుంటే స్థానిక ప్రజాప్రతినిధి ఫరూక్ చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. ముస్లిం జేఏసీ నాయకులు అబులేసు మాట్లాడుతూ బొగ్గులైన్ ప్రాంతవాసులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా, రోడ్డు విస్తరణ పేరుతో బలవంతంగా ఖాళీ చేయిస్తూ పేదల పొట్ట కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు మస్తాన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు, తమ అనుచరులకు అమూల్యమైన ప్రభుత్వ భూములను దారదత్తం చేస్తూ, 'సూపర్ సిక్స్' హామీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ఉచిత ప్రయాణమని చెప్పి, రోడ్డెక్కడానికి వీల్లేని, కనీస ఫిటినెస్ లేని బస్సులను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఆర్టీసీ వ్యవస్థను గాలికి వదిలేశారని విమర్శించారు. ఎస్ డి పి ఐ నాయకులు కరీముల్లా మాట్లాడుతూ ప్రజల మధ్య ప్రాంతీయ, కుల చిచ్చులు పెట్టే ప్రభుత్వ కుట్రలను అడ్డుకుంటామని, తాము ఎల్లప్పుడూ పేదల పక్షానే నిలబడి పోరాడుతుందని నాయకులు స్పష్టం చేశారు. పేదలకు న్యాయం జరిగే వరకు, ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేస్తూ ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో కీలక పోరాట కార్యాచరణను ప్రకటించారు. ఇందులో భాగంగా జూన్ 8న జిల్లా కలెక్టర్‌కు, జూన్ 9న న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్‌కు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. జూన్ 15 నుండి పట్టణంలోని అన్ని సచివాలయాల వద్ద ముట్టడి, ధర్నాలు నిర్వహిస్తామని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే జూన్ 20న తహశీల్దార్ కార్యాలయం ముందు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఉద్యమంలో పట్టణంలోని నిరుపేదలను ఏకం చేసి కూటమి ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాడతామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జమాత్ ఇస్లామి నాయకుడు సమద్, సిపిఐ నాయకులు మురళీధర్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి భూమనిశ్రీనివాసులు, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు డి శ్రీనివాసులు, సిపిఐ సీనియర్ నాయకుడు సంజీవులు, మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ, పద్మావతి, వామపక్ష, అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఇళ్ల స్థలాలు అర్జీదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎన్.టి.అర్. షాది ఖానా దుస్థితి చూడండి.

### పెళ్ళిళ్ళకు డబ్బులు వస్తాయి...మరమత్తులు నిల్.

### చెట్లు మొలిచి ఒకవైపు కూలెందుకు సిద్ధంగా ఉన్న షాది ఖానా.

### షాది ఖానా కమిటీ ఏమి చేస్తుంది.



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 4 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణం ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఎన్.టి.అర్.షాది ఖానా దుస్థితి దారుణంగా మారింది. ఒకవైపు చెట్లు మొలిచి కూలెందుకు సిద్ధంగా ఉంది. షాది ఖానా కమిటీ ఉన్న ఏమి చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. వివరాల్లోకి వెళితే మైనార్టీల పెళ్ళిళ్ళకు షాది ఖానా లేకపోవడంతో మైనార్టీలు ఇబ్బంది పడేవారు. తెలుగుదేశం ప్రభుత్వ హయంలో మంత్రిగా ఉన్న ఫరూక్ దృష్టికి వెళ్ళింది. మైనార్టీలు పెళ్ళిళ్ళకు ఇబ్బందులు పడకుండా షాది ఖానా కు నిధులు మంజూరు చేయించి షాది ఖానా ఏర్పాటుచేశారు. షాది ఖానా ఏర్పాటు చేయడంతో మైనార్టీల పెళ్ళిళ్ళ కు ఇబ్బందులు లేకుండా సంతోషంగా సాగేవి. కాలం మారుతున్న విధంగా షాది ఖానా లో పెళ్ళిళ్ళకు వచ్చే రుసుము వస్తున్నా షాది ఖానా కు మరమత్తులు చేయడంలో కమిటీ విఫలం అయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం షాది ఖానా కు ఒక వైపు చెట్లు మొలిచి ఆ ప్రాంతంలో కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఇటీవల మంత్రి ఫరూక్ ఒక సమావేశంలో షాది ఖానా లో పాల్గొని షాది ఖానా దుస్థితి చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. డోలలకు రంగులు పాలిపోయి, పరిశుభ్రత సరిగా లేదని, గతంలో పెళ్ళిళ్ళ సమయంలో మైనార్టీ మహిళలు పైన కూర్చొని పెళ్ళిళ్ళ చూసేవారన్నారు. ప్రస్తుతం ఎలాంటి మరమ్మతులకు నోచుకోక పోవడంతో పై భాగాన మొక్కలు మొలిచి కూలెందుకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం పెళ్ళిళు ళ్ళ లేకపోవడం విశేషం. ఇప్పటికైనా షాది ఖానా కొమరమత్తులు చేస్తారని ఆశిద్దాం.

# వివాహానికి హాజరైన మాజీ మంత్రి బుగ్గన.



**బేతంచెర్ల 4 (నందిపత్రిక ).** బేతంచెర్ల పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు అల్తాఫ్ హుస్సేన్ కుమార్తె వివాహ ము బేతంచెర్ల పట్టణంలోని ముస్లిం మైనార్టీ ఫంక్షన్ హాల్ లో గురువారం జరిగింది . ఈ వివాహానికి హాజరైన రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి వర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి. నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. మాజీ మంత్రి బుగ్గన తోపాటు బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్. చలం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ ముర్తు జావలి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఖాజా హుస్సేన్, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వరరెడ్డి, నాయకులు జస్వంత్ రెడ్డి, చిన్న ఎద్దులన్న, సలీం, ఖాజా, వలి భాష తదితరులు వివాహానికి హాజరై నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

# మహిళల భద్రతకేది భరోసా?

### నంద్యాలలో ఘనంగా భారత జాతీయ మహిళా సమాఖ్య 72వ వార్షికోత్సవం

**నంద్యాల ప్రతినిధి. జూన్ 05 . (నంది పత్రిక ):**రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులు, పసిబాలికలపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులు, అమానుష అత్యాచారాలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని భారత జాతీయ మహిళా సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షురాలు జి. లక్ష్మీదేవి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళా సమాఖ్య 72వ వార్షికోత్సవం సందర్భంగా నంద్యాల పట్టణంలోని సాయిబాబా నగర్‌లో గల సిపిఐ జిల్లా కార్యాలయంలో గురువారం మహిళా సమాఖ్య పట్టణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా జెండావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జి. లక్ష్మీదేవి మాట్లాడుతూ.. నేడు సమాజంలో ఆరు నెలల పసికందు నుండి పండు ముసలి వరకు ఎవరికీ ఎక్కడా భద్రత లేని దారుణమైన అరాచక పరిస్థితులు తాండవిస్తున్నాయని దుయ్యబట్టారు. చదువుకునే విద్యార్థి దశ నుండి మొదలుకొని ఉపాధి, కూలీ పనులు చేసుకునే మహిళల వరకు ప్రతి ఒక్కరూ తాము పనిచేసే చోట నిరంతరం వేధింపులకు, వివక్షకు గురవుతూ అభద్రత మధ్య బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమం, రక్షణ అంటూ వేదికలపై కేవలం కాగితాలకే పరిమితమయ్యే మోసపూరిత హామీలు గుప్పిస్తున్నాయే తప్ప, ఆచరణలో కల్పిస్తున్న రక్షణ శూన్యమని విమర్శించారు. చట్టాలు ఎన్ని తెచ్చినా క్షేత్రస్థాయిలో అఘాయిత్యాలు ఆగకపోవడం ప్రభుత్వాల చేతగానితనానికి నిదర్శనమని, పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్లే నేరస్థులకు భయం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, పసిపిల్లలపై జరుగుతున్న ఇటువంటి ఘోరాలను అరికట్టడానికి కేవలం చట్టాలు, జీవోలు మాత్రమే సరిపోవని.. ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు అధికారులు కఠినంగా వ్యవహరించడంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా కదిలినప్పుడే మహిళలకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ 72వ వార్షికోత్సవ సమర శంఖారావంతో పాలకుల కళ్లు తెరిపించేలా, మహిళల హక్కుల కోసం మరింత ఉధృతంగా పోరాటాలు చేయడానికి సమాఖ్య సిద్ధమవుతోందని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నంద్యాల పట్టణ కార్యదర్శి సుశీలమ్మ పద్మ. సునీత మేరీ రంజాబి మౌలాలమ్మ లలిత విజయశాంతి మహిమన్ జిల్లా నాయకురాళ్లు,. ప్రతినిధులు.... పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.




# పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం విజయవాడ రహదారిపై ట్రాఫిక్ చిక్కులు

హయత్‌నగర్‌లో పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ లక్ష్మారెడ్డి పాలెం దగ్గర కారును ఢీకొట్టి పెట్రోల్ ట్యాంకర్ పల్టీ కొట్టింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చే రూట్‌లో ప్రమాదం జరగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సర్వీస్ రోడ్డులో వెహికల్స్?ను పోలీసులు పంపిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఫైర్ సిబ్బంది ఫోమ్ స్ప్రే చేస్తున్నారు. ఈ ఘటనలో రెండు కార్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# మైనారిటీల విద్యాభివృద్ధి కోసం కృషి

### -చంద్రబాబు హయాం లోనే మైనారిటీల సంక్షేమం

### మైనారిటీ,న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్

### ఎస్ ఎస్ సి, ఇంటర్ లో అత్యుత్తమ మార్కులు సాధించిన మైనారిటీ విద్యార్థులకు సన్మానం



**అమరావతి జూన్ 04. నంది పత్రిక:**మైనారిటీల విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ బద్దంగా కృషి చేస్తున్నదని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. రాష్ట్రస్థాయిలో పదవ తరగతి, ఇంటర్ విద్యలో అత్యుత్తమ మార్కులు సాధించిన మైనారిటీ విద్యార్థులను గురువారం మంత్రి సన్మానించి ఆశీర్వదించారు. వెలగపూడి సచివాలయం మూడవ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ విద్య తోనే తాము అనుకున్న ఉన్నత స్థాయికి యువత ఎదిగి దేశ నిర్మాణ ప్రక్రియలో పాలుపంచుకోగలరని అన్నారు. మైనారిటీ కుటుంబాల్లో విద్యార్థుల శ్రేయోభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇటీవలనే వక్ఫ్ బోర్డు ద్వారా తాలిం ఏ హునర్ పథకం క్రింద కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత రెసిడెన్షియల్ ఇంటర్ విద్య కోసం నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో ప్రతిభగలిగిన 250 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. మైనారిటీ కుటుంబాలలోని ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ఉచిత డీఎస్సీ శిక్షణ, పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో మైనారిటీల సంక్షేమ శాఖ ఇంచార్జ్ సెక్రటరీ సూర్య కుమారి, మైనారిటీ కార్పొరేషన్ ఎండి యకూబ్ భాష, క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండి శేఖర్, డిడి సరోజినీ, అధికారులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హామీల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం..



**చాగలమర్రి జూన్ 4నంది పత్రిక** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుందని వెన్నుపోటుకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వైసిపి నాయకులు , కార్యకర్తలు నిరసన తెలిపారు. గాంధీ సెంటర్ మీదుగా గురువారం వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, మేనిఫెస్టో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి, మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువత అభివృద్ధి వంటి అనేక అంశాల్లో ఇక మీ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోకుండా హామీలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు షేక్ బాబూలాల్, పత్తి నారాయణ, కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారులకు మంచి సువర్ణ అవకాశం.

### టెక్కే వ్యవసాయ మార్కెట్ కమిటీ దుకాణాలకు వేలం పాటలు.

### ఈ నెల 9 న 10 దుకాణాలు,ఒక గోడౌన్ కు వేలం పాటలు.

### పట్టణ నడిబొడ్డులో దుకాణాలు...వ్యాపారులు సద్వినియోగం చేసుకోండి.

**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 4 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణం టెక్కే వ్యవసాయ మార్కెట్ కు సంబంధించిన 10 దుకాణాలు,ఒక గోడౌన్ కు ఈ నెల 9 న వేలం పాటలు నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు గుంటుపల్లి హరి బాబు పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 20 దుకాణాలు ఉన్నాయి.ప్రస్తుతం ఆ దుకాణాల్లో ఉన్న వారి గడువు ముగిసింది.ఈ నేపథ్యంలో 1 దుకాణం నుంచి 10 వ దుకాణం ,ఒక గోడౌన్ ఈ నెల 9 వేలం పాటలు వేస్తున్నారు.వేలంపాటలో పాల్గొనే వారు కమిటీ కార్యాలయంలో వెయ్యి రూపాయలు కట్టి అప్లికేషన్ తీసుకోవాలని పేర్కొన్నారు.వేలం పాటలో పాల్గొనే వారు దరావస్తు సొమ్ము 5 వేలు చెల్లించి వేలం పాల్గొనాలని అన్నారు.వేలం పాటలో దుకాణం రాని పక్షంలో కట్టిన డబ్బు వరం లో తిరిగి ఇస్తామని పేర్కొంటున్నారు.వ్యాపారులకు మంచి సువర్ణావకాశం.ప్రధాన సెంటర్లో ఉండడంతో వ్యాపారాలు బాగా జరుగుతాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.పట్టణ,గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎవరైనా వేలం పాటల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

# విత్తనాలు బీజామృతంతో విత్తన శుద్ధి విత్తన గుళికలు తయారు.

### పొలంలో వెదజల్లించిన ఎం టి. రమాదేవి.



**బేతంచెర్ల జూన్ 4 ( నంది పత్రిక ).** డోన్ డివిజన్ బేతంచర్ల మండలం గోల్లగుట్ట క్లస్టర్, గోల్లగుట్ట గ్రామం లోగురువారం నాడు ఎంటి. రమాదేవి ఆద్వర్యంలో రైతులు పద్మనాభ రెడ్డి,ఆల మద్దిరెడ్డి పొలాలలో పిఎండిఎఎస్ (నవధాన్యాలు) విత్తనాలు బీజామృతంతో విత్తనశుద్ధి చేసి, విత్తనగుళికలు తయారుచేసి వెదజల్లడం జరిగింది. అక్కడికి వచ్చిన రైతులకు నవధాన్యాలు వేసుకోవడం వలన ఉపయోగాలను, తెలియచేస్తూ నవధాన్యాల సాగువలన, భూమి సారవంతం అవుతుందని, పశువుల మేతకు ఉపయోగించ వచ్చునని,నేల కోతకు గురి కాకుండా ఉంటుందని,సార్వత్రిక సూత్రాల గురించి తెలియ జేయడం జరిగింది.ఏలినో ప్రభావం వల్ల, రైతులు వర్షభావ పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని, తక్కువ నీటితో సాగే పంటలు, చిరుధాన్యాలు వేసుకోవడానికి రైతులు ఎంచుకోవాలని, ప్రధాన పంటగా వేసుకోవాలని, రైతులకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రైతులు,వి ఆర్ఎల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు నందిపల్లె నాగేష్ ఐసిఆర్పిలు నాగేంద్రమ్మ,రమేష్, ప్రసాద్ లు తదితరులు హాజరు కావడం జరిగింది.

# మద్దిలేటి వాగు వెంట మట్టి మాఫియా త్రవ్వకాలు



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 4 :** మట్టి మాఫియా దారులు చెలరేగిపోతున్నారు. యదేచ్ఛగా మట్టిని తరలిస్తూ రైతు ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారు. మట్టి మాఫియా పనులకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. కొందరు గ్రామస్థాయి నాయకులను అడ్డం పెట్టుకొని అక్రమంగా మట్టిని తరలించుకొని పోతూ సొమ్ము చేసుకుంటున్నారు. గత రెండు రోజులుగా బండి ఆత్మకూరు సింగవరం గ్రామాల మధ్య ప్రవహిస్తున్న మద్దిలేరు వాగు కట్టను మట్టి మాఫియా దారులు బహిరంగంగా జెసిబి సహాయంతో ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకొని మట్టిని తరలించుకొని పోతున్నారు. గత కొద్ది కాలం క్రితం వర్షాకాలంలో మద్దిలేరు వాగు పొంగి ప్రవహిస్తూ ఉండటంతో ఉపాధి హామీ పనుల ద్వారా మద్దిలేరు వాగు కట్టను పటిష్టంగా నిర్మించుకున్నట్లు ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. దీనివల్ల మద్దిలేటి వాగులో నీటి ప్రవాహం పెరిగిన నేపథ్యంలో బలమైన కట్టలను ఏర్పాటు చేసుకోవడం వల్ల పంటలు నీట మునిగిపోయే పరిస్థితి లేదని రైతులంటున్నారు. మద్దిలేరు వాగు సమీపంలో కొంతమంది అక్రమార్కులు దృష్టి సారించి గత రెండు రోజులుగా జెసిబి సహాయంతో మట్టిని తరలించుకొని పోతూ ఉన్నారన్న విషయం రైతుల దృష్టికి వచ్చింది. కొంతమంది రైతులు ఈ విషయం తెలుసుకొని గురువారం మట్టి తరలిస్తున్న ప్రదేశానికి చేరుకొని అక్రమార్కులతో రైతులు వాదనలకు దిగారు.. తమ పనులకు అడ్డు తగలడంతో మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు అక్కడినుండి పలాయనం చిత్తగించారు. అక్రమార్కులు అక్రమంగా మట్టిని తరలించుకొని పోవడం వల్ల భవిష్యత్తులో ఈ ప్రాంతంలో పంట పొలాలు నీటి మునిగిపోయే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మట్టి మాఫియా దారులు అక్రమంగా యదేచ్ఛగా మట్టిని తరలించుకొని పోతూ ఉంటే కేసి కెనాల్ అధికారులు ఏం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం కడమకాల్వ సమీపంలో యదేచ్ఛగా మట్టి మాఫియా దారులు అక్రమంగా మట్టిని



తరలించుకొని పోయి లక్షల రూపాయలను సొమ్ము చేసుకున్నారు. వేల టన్నుల బరువుతో టిప్పర్ల ద్వారా తెలుగు గంగ కాలువ కట్టలపై మట్టిని తరలించారు. యదేచ్ఛగా మట్టిని తరలించుకొని పోతూ ఉన్నప్పటికీ తెలుగు గంగ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. భవిష్యత్తులో తెలుగు గంగ కాలువలో నీరు అధికమైనప్పుడు కాలువ కట్టలు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు అప్పట్లోనే ఆరోపణలు గుప్పించారు. తిరిగి మట్టి మాఫియా దార్లు చెలరేగిపోయి మద్దిలేరు వాగు వద్ద మట్టిని తరలించకపోయే పనులకు పూనుకున్నప్పటికీ కెసి అధికారుల దృష్టికి రాకపోవడం కొసమెరుపు.

# ప్రజలకు వెన్నుపోటుపొడిచిన దగాకోరు చంద్రబాబు

### బనగానపల్లె లో కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీ పై వైసీపీ నిరసన

### టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టో, సూపర్ సిక్స్ బాండ్ల దగ్ధం



**బనగానపల్లె జూన్ 4నందిపత్రిక** ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచిన దగాకోరు చంద్రబాబు నాయుడని బనగానపల్లె వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గురువారం కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలకు వెన్నుపోటు పొడిచారాని కూటమి ప్రభుత్వం పై నిరసన తెలిపారు.బనగానపల్లె పట్టణం వైఎస్సార్సీపీ కార్యాలయం వద్ద టీడీపీ మ్యానిఫెస్టో,సూపర్ సిక్స్, బాండ్లను దగ్ధం చేసి బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ,వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబుల్ రెడ్డి నిరసన తెలిపారు. ఈ సందర్బంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్ర బాబు ప్రజలకు చేసిన వెన్నుపోటు కు రెండేళ్లు గడిచిందని ఎగ్గొట్టిన హామీలను వివరించారు.18 సంవత్సరాలు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ 15,00 హామీ ఏమైంది నిరుద్యోగులకు నెలకు 3,000 వేల రూపాయలు హామీ లేదు,ఏడాదికి మూడు సిలిండర్లు హామీ ఏమైంది,కొత్తపింఛన్ల కోసం అర్హులు పడిగాపులు కాస్తున్న ప్రభుత్వం వాటిని గాలికి వదిలింది. తల్లికి వందనం పేరుతొ ఎంతమంది పిల్లలు చదువు కుంటే అందరికి 15000 అన్నారు మొదటి సంవత్సరం పథకం లేదు రెండవ ఏడాది 2025-26 ఏంతో మంది విద్యార్థులకు ఎగ్గొట్టారు.అర్హతా ఉన్న పిల్లలకు ఎగ్గొట్టారు.ఏపీ ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ధగా కోరు చంద్రబాబు అన్నారు.ఏపీ ప్రజలకు చంద్ర బాబు ఇచ్చిన హామీలు నెరవేర్చేంత వరకు వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తూనే ఉంటాం అని అన్నారు కార్యక్రమం లో వైఎస్సార్సీపీ రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహీద్ హుస్సేన్,జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ ఫైజ్,సిద్ధంరెడ్డి రామ్ మోహన్ రెడ్డి,అంబటి రవి రెడ్డి,పాపిరెడ్డి సుదర్శన్ రెడ్డి, కైప ప్రతాప్ రెడ్డి, జిటి వెంకటరామిరెడ్డి, కుమ్మరి సురేష్,సూర కిషోర్ కుమార్, కటిక కరీం,చక్రవర్తి సాదక్,జస్వంత్ కుమార్ రెడ్డి, హాజీ హుస్సేన్,మీరెసెన్ అబ్బాస్,కృష్ణ రెడ్డి,ఎర్రగుడి రామసుబ్బారెడ్డి, హైదర్, మోయిన్,వైఎస్సార్సీపీ నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**చాగలమర్రి జూన్ 4నంది పత్రిక** గత నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కార్యకర్తలు శేఖర్ రెడ్డి, రామ్ చెన్నారెడ్డి లను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పరామర్శించారు. ప్రమాదం గురించి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే బాధితులకు ధైర్యము చెబుతూ, పూర్తిస్థాయిలో కోలుకోవాలని , రాము అండగా ఉండి అందుబాటులో ఉంటామన్నారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈమె వెంట కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా.. మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

**చాగలమర్రి జూన్ 4 నంది పత్రిక** కార్యకర్తలకు వెన్నంటి అండగా ఉంటానని ఆళ్లగడ్డ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. గురువారం నేలంపాడు గ్రామంలోని ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎవరు కూడా భయపడాల్సిన అవసరం లేదని నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. రైతే రాజని, వైయస్ జగన్ అన్న హయాంలో రైతు సంక్షేమానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అందరూ కూడా రాజన్న రాజ్యం కోసం ఎదురుచూస్తున్నారని రానున్న రోజుల్లో జగనన్న నాయకత్వమును కోరుతున్నారన్నారు. ఈయన వెంట వైసిపి నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, గంగుల అభిమానులు ఉన్నారు.



# గడ్డివాామి దగ్ధం 60,000 ఆస్తి నష్టం



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 4 :** బండి ఆత్మకూరు మండలంలో పంట పొలాలలో వట్టి కోయ్యలు కాలుస్తూ ఉండగా ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు చెలరేగి గడ్డివామి పూర్తిగా కాలిపోయిన సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. రైతులు తెలిపిన సమాచారం మేరకు పార్నపల్లి గ్రామానికి చెందిన నర్ల ప్రభాకర్ రెడ్డి అనే రైతు గడ్డివాము ప్రక్కన ఉన్న పొలాల కొయ్యలు కాలుస్తూ ఉండగా నిప్పురవ్వలు గడ్డివామీపై పడ్డాయి. ఈ కారణంగా నిప్పురవ్వలు గడ్డివామీపై పడి మంటలు చెలరేగి గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. దీనివల్ల 60 వేల రూపాయల ఆస్థి నష్టం సంబంధించిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు నర్ల ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# కూటమి సుపరిపాలనకు రెండేళ్లు

### రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**బనగానపల్లె జూన్ 4నందిపత్రిక** సమాజంలో అన్ని వర్గాల సంక్షేమ, అభివృద్ధే ధ్యేయంగా కొనసాగుతున్న కూటమి పాలన రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్బంగా రాష్ట్ర రోడ్డు భవనాల శాఖమంత్రి బీసి జనార్దన్ రెడ్డి నియెజకవర్గ, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసినట్లు గురువారం మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం..గ్రామీణ, పట్టణ ప్రాంతాల రూపురేఖలు మార్చేలా రహదారుల అభివృద్ధి పనులు చేపట్టామని,ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్న 3 గ్రీన్ ఫీల్డ్ పోర్టులు చంద్రబాబు సమర్థ, సుస్థిర పాలనతో పెట్టబడిదారుల్లో విశ్వాసం పెరిగిందని, మంత్రి లోకేష్ చొరవతో రాష్ట్రానికి వెల్లువెత్తుతున్న భారీ పెట్టుబడులు.రెండేళ్ల పాలనలో దేశంలోనే అగ్రగామిగా 25 % పెట్టుబడులు సాధిస్తూ, పెట్టుబడుల గమ్యస్థానంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ అని,పెట్టుబడుల రాకతో, పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాష్ట్రంలో భయాందోళనలు లేని, ప్రశాంతమైన ప్రజాస్వామ్య పాలనకు రెండేళ్లు పూర్తి అయింది మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల జోడితో సమగ్రాభివృద్ధి దిశలో ఆంధ్రప్రదేశ్ పయనం సాగిస్తున్నదని మంత్రి ప్రకటించినట్లు పేర్కొన్నారు.



# ఖసిటీ స్థాయి ఎన్విరాన్మెంటల్ క్విజ్ ప్రారంభ కార్యక్రమం

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ,ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు,లయన్స్ క్లబ్ అఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ, భారత్ వికాస్ పరిషత్ ల సంయుక్త ఆధ్వర్యంలో నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని జరిగిన సిటీ స్థాయి ఎన్విరాన్మెంటల్ క్విజ్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ గనులు మరియు భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తాళ్లపాక నటరాజ్ మాట్లడుతూ ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణలో తనవంతు భాద్యతను గుర్తించాలన్నారు. నీటిని ఆదాచేయడం, విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరూ అలావాటుచేసుక్వాలన్నారు.లీగల్ సర్వీసెస్ మెంబర్ నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు లయన్స్ క్లబ్ అఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చున్నారు.విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు లయన్ మురారి శంకరప్ప మాట్లాడుతూ విపరీతంగా పెరిగిన వాహనాల వినియోగంవల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడి గ్లోబ్లవార్మింగ్ కు దారితీస్తునందన్నారు. క్విజ్ పోటీలకు మాస్టర్ లయన్ కె. డి. జె బాబు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని కల్పించడమే పంచ పర్యావరణ దినోత్సవ లక్ష్యం అన్నారు.భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటడానికి ప్రయత్నించాలన్నారు.పురస్కరించుకుని నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తాసిల్దార్ ఓరి, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి రాయపాటి నాగలక్ష్మి, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహం చట్టరీత్యా నేరం శ్రీ పి. శ్రీనివాసచార్యులు.




**శిరివెళ్ల (నంది పత్రిక) :** సమాజంలో బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి హిందూ ప్రచార సేవా సమితి అధ్యక్షులు పి శ్రీనివాసచార్యులు పేర్కొన్నారు నంద్యాల జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన బాల్య వివాహాలు నిర్మూలన కార్యక్రమములో పి శ్రీనివాసచార్యులు ప్రసంగించారు. ప్రస్తుత సమాజంలో బాల్యవివాహాలు జరగకుండా ఉండాలి అంటే పిల్లలను దగ్గరకు చేర్చుకొని వారితో ప్రేమ పంచుకోవడం వారి తప్పు ఉన్నా కూడా వారికి ధైర్యం చెప్పి చదువు వైపు మళ్ళించాలన్నారు. ప్రతిరోజు పిల్లలతో కలిసి భోజనం చేయడం వారి దినచర్య ఎలా ఉంది అని అడగడం వారితో మితంగా మధురంగా మాట్లాడడం వారి సమస్యలకు సరైనటువంటి సమాధానం చెబుతూ ముందుకెళ్లడం వారి జీవితాన్ని సుఖవంతంగా తీసుకెళ్లడం వంటి సాంప్రదాయబద్ధమైన జీవనశైలితో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని పి శ్రీనివాసచార్యులు సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే మహిళా పోలీస్ లకు పోలీస్ స్టేషన్ కు 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు చేయొచ్చన్నారు. బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌరవ లీలావతి మరియు అసిస్టెంట్ కమిషనర్ దేవాదాయ శాఖ హిందూ మత పెద్దలు ముస్లిం మత పెద్దలు దేవాదాయ శాఖ ఈవోలు అర్చక స్వాములు పాల్గొన్నారు.





# వైసిపి ఆధ్వర్యంలో'వెన్నుపోటు దినం'



**జూపాడుబంగ్లా, జూన్ :4 (నంది పత్రిక ):** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ నాయకత్వంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ను అమలు చేయకుండా ప్రజలను అందుకే ఈరోజు వెన్నుపోటు దినోత్సవం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తూ టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలను దహనం చేస్తున్నామని మండల కేంద్రమైన జూపాడుబంగ్లా లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం దగ్గర కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మేనిఫెస్టోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి,నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ డాక్టర్ దారా సుధీర్ ల ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పి. లింగాపురం గ్రామ మాజీ సర్పంచ్ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను పథకాల అమలు చేయలేదని ఆయన విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగం వచ్చేవరకు మూడు వేల రూపాయలు భృతి చెల్లిస్తామని చెప్పి ఆ ఊసే లేదన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని చెప్పి రెండు సంవత్సరాలలో కేవలం రెండు సిలిండర్లు మాత్రమే అందించారన్నారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ వసతి జీవన వంటి పథకాలు నిలిపివేశారన్నారు. మహిళలకు ఆడబిడ్డ నిధి పేరుతో ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పడం జరిగింది.50 సంవత్సరాలు నిండిన మహిళలకు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి నా ఇప్పటికీ అమలు చేయడం లో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ప్రజలు కూటమి నాయకులు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి నెరవేర్చునన్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యతిరేకంగా ఓట్లు వేసి కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి పోచా జగదీశ్వర్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, గోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి,, కదిరి పుల్లయ్య, హరేంద్ర, బి. సురేష్, తంగడంచ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నల్లారెడ్డి జన్మదిన వేడుకలు.

## మిత్రులు ఆత్మీయులు మధ్య భారీగా కేక్ కట్ చేసి సంబరాలు.



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆదోని పట్టణంలో ఎంతోమందికి ఉపాధి కల్పించిన వ్యక్తిగా మరియు సమాజానికి సేవ చేస్తూ పేరు ప్రఖ్యాతలు అవసరం లేదు సమాజమే దేవాలయం అని జీవిస్తున్న వ్యక్తి తంగర డోనా నల్లారెడ్డి. అటువంటి నిజమైన సేవ భావాజాలగల వ్యక్తి ఆదోని పట్టణంలో సుమారు 80 మహిళ కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ వారి జీవితాలకి వెలుగు కనిపిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ఎస్ కే డి కాలనీ లో జీన్స్ ప్యాంట్ల తయారీ కేంద్రం శిక్షణ ఇస్తూ ఉపాధి కల్పిస్తూ నల్లారెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సాధికారత కమిటీ మెంబర్,ఇండియన్ టెలికం సర్వీస్ అడ్వైజరీ కమిటీ మెంబర్ చాగి మల్లికార్జున రెడ్డి,పల్లె వెలుగు ఆదోని డివిజన్ ఇంచార్జ్ విరపాక్షి రెడ్డి, పల్లె వెలుగు రూరల్ విలేకర్ నాగరాజ్, నంది పత్రిక ఆదోని ప్రతినిధి సురేష్, హెచ్ఎంటీవీ మంజునాథ్, ఆదోని చరణ శ్రీ వైన్ షాప్ అధినేత చక్రధర్, బసాపురం మధు మరియు స్నేహితులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# అరాచక పాలన వైసీపీ ది

## అభివృద్ధి పాలన అంటేనే తెలుగుదేశం పార్టీ పాలన.



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** అరాచక పాలన వైసిపిది అభివృద్ధి పాలన తెలుగుదేశం పార్టీది ఐదు సంవత్సరంలో చెయ్యని అభివృద్ధి వైసీపీ పార్టీ రెండు సంవత్సరముల్లో అభివృద్ధి అంటే ఆంధ్ర రాష్ట్రాన్ని చూపించే తెలుగుదేశం ఎక్కడ గొడ్డలి పార్టీ వైసీపీది సంస్కారం పార్టీ తెలుగుదేశం పార్టీది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీతో మాత్రం సాధ్యం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కానీ అలాగే రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే అది టిడిపి తోనే సాధ్యం 2014 నుంచి 19 వరకు ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని క్యాపిటల్గా ప్రకటించారు అలాగే హీరో కియా ఇలాంటి ఎన్నో కంపెనీలు ఆంధ్ర రాష్ట్రానికి తెచ్చిన ఘనత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దక్కుతుంది 2019 నుంచి 2024 వరకు వైసిపి పార్టీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి యువతకు ఉపాధి ఎన్ని తెచ్చినారు చూపించండి ఐదు సంవత్సరములు అరాచకాలు దౌర్జన్యాలు భూ కబ్జాలు తప్ప మీరు చేసింది ఏమీ లేదు ఐదేళ్లలో ఆంధ్ర రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక పోయింది అభివృద్ధి అంటే అర్థం తెలియని దేశంలో ఏదైనా ఒక పార్టీ ఉందంటే అది వైసీపీ పార్టీ మాత్రమే దేశ రాజకీయాల్లో అభివృద్ధి అంటే తెలుగుదేశం పార్టీ అని గుర్తింపు తెచ్చుకునే దిశగా ఈరోజు చంద్రబాబు నాయుడు లోకేష్ పని చేస్తున్నారు అది చూసి తట్టుకోలేక రపరపా అని కొడ్డలి చూపిస్తూ అసూయ పడుతున్నారు సంస్కారం లేని నాయకులు మీరు, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు సంవత్సరములు ఎంతో అభివృద్ధి చెందింది ఎన్నో కంపెనీలు పెట్టుబడి పెట్టడానికి ఆంధ్ర రాష్ట్రానికి వస్తున్నాయి అంతేకాదు శాశ్వత రాజధానిగా అమరావతిని రూపకల్పన మారుస్తున్నారు, రాయలసీమలో ఎన్నో కంపెనీలు వస్తున్నాయి ఇలా చెప్పుకుంటూ పోతే దేశంలోనే ఆంధ్రప్రదేశ్ కు వచ్చిన పెట్టుబడి 26% వచ్చినాయి, అంటే విజనరీ నాయకుడు చంద్రబాబు నాయుడు శ్రమ, ఇప్పుడు రెండేళ్ల పాలన లో అరాచకం జరిగిందని రోడ్డు మీద వస్తున్నారు సిగ్గు అనిపించటం లేద మీకు, ఆంధ్ర రాష్ట్రాన్ని సముద్రంలో కలిపే పని చేస్తున్నారు, కానీ మా చంద్రబాబు నాయుడు ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రపంచస్థాయిలో నిలబెట్టాలని ఆలోచనలు చేస్తున్నారు ఇది తెలుగుదేశం పార్టీ ఆశయం అని అన్నారు.

# ఆదోని పట్టణంలోని రేషన్ షాప్ లో సక్రమంగా రేషన్ మరియు నిత్యవసర సరుకులు అందించాలి

## డివైఎఫ్ఐ పట్టణ నాయకులు.



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆదోని పట్టణంలోని రేషన్ షాపుల నందు సక్రమంగా రేషన్ మరియు నిత్యవసర సరుకులు అందించాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదోని తాసిల్దార్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలోనే అన్ని రేషన్ షాపులో నందు కేవలం నాలుగైదు రోజులు మాత్రమే అందిస్తున్నారని అలాగే ప్రభుత్వం మంజూరు చేసిన నిత్యవసర సరుకులు కొన్నిటికి మాత్రమే పరిమితమయ్యారు మరియు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ అందించాలి అన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ రకంగా ప్రజలకు సక్రమంగా రేషన్ అందించే విధంగా చూడాలని కోరారు. లేకపోతే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కార్యదర్శి మోహన్ ,వెంకటేష్ ,నాగరాజు పాల్గొన్నారు.

# రహదారిపై కుంగిన వంతెనను పరిశీలించిన అధికారులు



**మహానంది జూన్ 04 (నంది పత్రిక):-** మహానంది మండలం బుక్కాపురం తిమ్మాపురం ప్రధాన రహదారిపై ఏర్పడిన ప్రమాదకర గుంతను అధికారులు పరిశీలించారు. గురువారం పీ ఆర్ డీఈఈ హయాజ్ అహ్మద్ ,పీ ఆర్ ఏఈ వెంకట రాముడు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రహదారిపై కుంగిన వంతెనను పరిశీలించామన్నారు.ఉన్నతాధికారులకు నివేదికలు పంపి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రుక్సానా, నేహా పాల్గొన్నారు.

# నేడు ఆళ్లగడ్డ పట్టణంలో ప్రజా గ్రీవెన్స్

## అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకూ కృషి చేస్తాం

## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 4 నంది పత్రిక** ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 4 వారాల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా నేడు శుక్రవారం చివరి వారం 'ప్రజా గ్రీవెన్స్' కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఈ సదస్సుకు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తో పాటు జిల్లా ఉన్నతాధికారుల యంత్రాంగం వస్తారన్నారు. 4 వారాల ప్లాన్‌లో చివరి వారం సదస్సు కాబట్టి ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు. స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో శుక్రవారం జరిగే ఈ కార్యక్రమానికి వచ్చే ప్రజలందరికీ సౌకర్యంగా ఉండేలా భోజన వసతి కూడా కల్పించడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకూ తన కృషి నిరంతరం కొనసాగుతుందన్నారు.

# "ఆపరేషన్ క్లీన్ స్వీప్" ను విజయవంతం చేయండి.

## హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్.



**తిరుపతి బ్యూరో చీఫ్ జూన్ 4 నంది పత్రిక** నగరంలో పరిశుభ్రతే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని అక్కారంపల్లి మార్గంలోని ఓపెన్ డ్రైనేజి కాలువల్లో పేరుకు పోయిన చెత్త, మట్టిని జెసిబిల సాయంతో తొలగించారు. శుభ్రం చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది విస్తృత స్థాయిలో శుభ్రత పనులు చేపట్టారు. అక్కారంపల్లి రోడ్డు వెంబడి ఉన్న కచ్చా కాలువలో పేరుకు పోయిన చెత్త, మట్టిని తొలగించామని తెలిపారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో రోడ్ల పైన చెత్త తొలగింపు, డ్రైనేజీలలో పేరుకుపోయిన పూడిక మరియు వ్యర్థాలను తొలగించే పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రైనేజీ కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రపరచి మురుగునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. కాలువల్లో చెత్త వేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే మా సిబ్బందికి ఇచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్ సుమతి, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్ తో గాయపడిన గొర్రెల కాపరికి ప్రమాద భీమా సహాయం



**బనగానపల్లె జూన్ 4నందిపత్రిక** బనగానపల్లె మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బి. రామపుల్లయ్య పొలంలో గొర్రెలు మేపుతుండగా ఇటీవల కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న బీసీ ఇందిరా రెడ్డి వెంటనే స్పందించి ఆయనను కర్నూలు ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. అనంతరం బాధితుడికి న్యాయం చేయాలని విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి, శాఖ పరంగా మంజూరైన రూ.50 వేల ఆర్థిక సాయాన్ని బాధితుడికి తన చేతుల మీదుగా అందించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖకు చెందిన మద్దిలేటి (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్), శ్రీనివాసులు (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్), షబ్బీర్ హుస్సేన్ (లైన్ ఇన్‌స్పెక్టర్), శ్రీధర్ బాబు (లైన్‌మన్), చందు నాయక్ (లైన్‌మన్), రామిరెడ్డి (అసిస్టెంట్ లైన్‌మన్) పాల్గొన్నారు.

# రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలి

## ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలి :

## రజక వృత్తిదారుల సంఘం డిమాండ్

**వెలుగోడు, జూన్ 04 నంది పత్రిక :** ఎన్నికల ముందు రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వెలుగోడు మండల కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సి. వెంకటేశ్వర్లు , రాష్ట్ర కమిటీ సభ్యులు సి. శేషాద్రి , డాక్టర్ నాగ శేషులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసు రత్నం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వ వృత్తిదారుల సంక్షేమ పథకాలు ఇప్పటి వరకు అమలు కాలేదని తెలిపారు.రజకులకు 200 యూనిట్ల ఉచిత, రజక కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు, దేవాదాయ శాఖలో రజకులకు కమిటీల్లో స్థానం, చెరువులుకుంటల వినియోగానికి సంబంధించిన జీవో 343 అమలు, సామాజిక రక్షణ చట్టం, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం, విశ్వకర్మ కౌశల్య యోజన ద్వారా రుణాలు, పనిముట్ల పంపిణీ వంటి హామీలను నెరవేర్చాలని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎన్నో సంవత్సరాలు గడిచినా నేటికీ రజక వృత్తిదారులపై దాడులు, సాంఘిక బహిష్కరణలు, వీటిని అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ తరహాలో సామాజిక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.ప్రతి గ్రామంలో అవసరమైన చోట దోబీఘాట్లు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని, జీవో నెంబర్ 27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను రజకులతో భర్తీ చేయాలని నిర్ణయించారు. అలాగే జీవో నెంబర్ 6 ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా రజక వెల్ఫేర్ కమిటీ సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. రజక కార్పొరేషన్‌కు చైర్మన్ నియమితులై నెలలు గడుస్తున్నా వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో, కార్పొరేషన్‌కు నిధులు సాధించడంలో తగిన శ్రద్ధ చూపడం లేదు. రాబోయే రోజుల్లో రజక వృత్తిదారులను ఐక్యం చేసి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేపడతామని ప్రకటించారు.ఈ సందర్భంగా వెలుగోడు మండల రజక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరసింహులు , కార్యదర్శిగా ఎల్లయ్య , ఉపాధ్యక్షుడిగా చికెన్ మధు , సహాయ కార్యదర్శిగా సురేష్ కొత్త వారిని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో శీలం వెంకటేశ్వర్లు, జములయ్య, శివన్న, పరశురాం, బాలుడు ఎన్. మధు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు



# వైఎస్ఆర్సిపి భారీ బైక్ ర్యాలీ



**కూటమి ప్రభుత్వానివి వెన్నుపోటు రాజకీయాలు**

**రెండేళ్లు దాటిన అడ్రస్ లేని సూపర్ సిక్స్ హామీలు**

**ఇచ్చిన హామీలను నెరవేర్చలేదంటూ ఉమ్మడి**

**మేనిఫెస్టో ప్రతుల దహనం**

**చంద్రబాబు షూరిటీ- మోసం గ్యారెంటీ - మాజీ**

**ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి**

**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 4 నంది పత్రిక** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2సంవత్సరాల కాలం నడుస్తున్న ఎన్నికలవేళ ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఈ రెండేళ్ల పాలన కేవలం వెన్నుపోటు పాలనగా మారిందని ప్రజలను నమ్మించి వంచించడమే కూటమి ప్రభుత్వం ఏకైక లక్ష్యంగా పెట్టుకుందని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజే శీద్రారెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని వైకాపా కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే గంగుల బైకు ర్యాలీ నిర్వహించారు. వైయస్సార్ విగ్రహం వద్ద కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎన్నికల నాటి సూపర్ సిక్స్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ మహిళలకు ప్రతినెల 1500 రూపాయలు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి హామీలు ఏమైనాయని అడిగారు, తల్లికి వందనము రెండు సంవత్సరాలకు ఒక విద్యార్థికి 30,000వేలరూపాయలు ఇవ్వాల్సి ఉండగా 15000,వేల రూపాయలు ఇచ్చారన్నారు. రైతులకు కేంద్రం ఇచ్చే రైతు భరోసాతో సంబంధం లేకుండా 20000 రూపాయలు ఇస్తామని చెప్పి రెండేళ్లలో 40 వేలకు బదులుగా 5 వేలు 10 వేలుఇచ్చి మోసం చేశారన్నారు. రైతులు పండించిన జొన్నలు కొనుగోలు చేయాలని రైతులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తుంటే కేటాయింపు మీద కొనుగోలు చేశారని చెప్పడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మొక్కజొన్న రైతులు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో



ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్టీ వ్యవస్థాపకుడికి వెన్నుపోటు పొడిచి మీరు వెన్నుపోటు గురించి మాట్లాడడం తగదన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు న్యాయం జరిగేందుకు అండగా ఉండడంతో వారి తరఫున పోరాటం చేస్తుందన్నారు ఈ వెన్నుపోటు కార్యక్రమాన్ని మారుమూల గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే గంగులనాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి , మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోపవరంనరసింహారెడ్డి, గంగుల రామిరెడ్డి,మాజీ కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, సింగం వెంకటేశ్వర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, నాసారి వెంకటేశ్వర్లు,కసెట్టి నాగేశ్వరరావు, రామకృష్ణ, భరత్ రెడ్డి, ఆజాద్,రమేష్ గౌడ్, మండలవైస్ ఎంపీపీ నా సారి నరసింహ ప్రసాద్, సర్పంచ్లు, మర్రిపల్లి నర్సిరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలి

### కందుల ప్రసాద్ రెడ్డి.

**శిరివెళ్ల :- (నంది పత్రిక)** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రైతుల కష్టాలు అధికమయ్యాయని వెంకటాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ భర్త వైసిపి యువ నేత కందుల ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రెండు సంవత్సరాల వెన్నుపోటు పాలన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో యూరియా, డిఏపి కొరత సృష్టించడమే కాకుండా అధిక ధరలు పెంచి అన్నదాతల వెన్ను విరిచినట్లు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. షరతులు నిబంధనలు సడలించి ఎరువుల ధరలు తగ్గించి రైతులకు అవసరమైన యూరియా, డి ఏ పి అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కందుల ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు.



# జూన్ 5న మార్టేరులో "ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు" నాలుగవ విడత కార్యక్రమం

### ఉదయం 9.30 గంటల నుంచి ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 4 నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా జూన్ 5న ఆచంట నియోజకవర్గం పెనుమంట్ర మండలం మార్టేరులో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మార్టేరు జడ్పీ స్కూల్ పక్కన ఉన్న వేణుగోపాల స్వామి ఆడిటోరియం నందు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు, వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆచంట నియోజకవర్గంలో మే15న తొలి విడత, మే 22న రెండో విడత, మే29న మూడవ విడత కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. జూన్ 5న ఆచంట నియోజకవర్గంలో నాల్గవ విడత కార్యక్రమంతో ఆచంట నియోజకవర్గంలో నాలుగు విడతల పిజిఆర్ఎస్ కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే జిల్లా, డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ఉదయం 9.00 గంటలకే మార్టేరు గ్రామం వేణుగోపాలస్వామి ఆడిటోరియంకు తప్పనిసరిగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# పద్మావతి నగర్లో 10 సెంట్ల స్తలం ప్రవేటు వైద్యులకు కేటాయించవద్దు.

### పేద వారికైనా ఇవ్వండి. 33 సెంట్లలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టి ప్రజలపై భారం తగ్గించండి.

**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 4 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణం పద్మావతి నగర్ లో ప్రవేటు వైద్యులకు ఉచితంగా 10 సెంట్ల స్థలం ఇవ్వడం కంటే,ప్రభుత్వ కార్యాలయాలు కట్టి ప్రజలపై భారం తగ్గించాలని మేధావులు కోరుతున్నారు.ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు,కార్యాలయాలు లేక బాడుగలు చెల్లిస్తున్నారు.ఆ భారమంతా ప్రజలపై పడుతుంది.వివరాల్లోకి వెళితే పద్మావతి నగర్ లో నంద్యాల మున్సిపాలిటీకి చెందిన 40 సెంట్ల స్తలం ఉంది.అప్పట్లో ఆ స్థలంలో 7 సెంట్లు శ్రీ కృష్ణ మందిరం కు ఇచ్చారు.ఆ స్తలం కాకుండా ఇంకా 33 సెంట్లు స్తలం ఖాళీగా ఉంది. స్థలం ఖాళీగా ఉండడంతో అందులో 10 సెంట్లపై ప్రవేటు వైద్యులు వారి కమ్యూనిటీ బిల్డింగ్ కోసం కన్నేశారు.ఈ నేపథ్యంలోనే మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకొని వెళ్లడంతో ఆలోచించి 10 సెంట్లు ఇస్తామని చెప్పడంతో పెద్ద చర్చ సాగుతుంది.ఈ నేపథ్యంలోనే పాత్రికేయులు ప్రెస్ క్లబ్ కు 5 సెంట్లు కేటాయించాలని అందరూ విగ్నేప్తి చేసినా స్పందన కరువైంది.నిత్యం ప్రభుత్వానికి,రాజకీయ నాయకులకు వార్తలు రాసే పాత్రికేయులు వార్తలు రాయడానికి ఎలాంటి సౌకర్యం లేదు.పార్టీల్లో మారుతున్నాయి,రాజకీయ నాయకులు మారుతున్నారు,అధికారులు మారుతున్నారు కానీ మీడియా కు కూర్చొని వార్తలు రాసుకోవడానికి ప్రెస్ క్లబ్ నంద్యాలలో లేకపోవడం దారుణం.పాత్రికేయులకు,పేద ప్రజలకు ఇవ్వకుండా కోట్లు సంపాదించే ప్రవేటు వైద్యులకు ఇస్తామని చెప్పడం తో అందరూ పలు ఆరోపణలు చేస్తున్నారు.చేతులు మారడంతో 10 కోట్లు విలువ చేసే స్థలం అప్పనంగా ఇస్తున్నారనే గుస,గుసలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ కార్యాలయాలు కడతారా,పేద ప్రజలకు ఇస్తారా,ఉచితంగా ప్రవేటు వైద్యులకు ఇస్తారా అనేది మిలియన్ డాలర్ ప్రశ్న గా మారింది.ప్రజలు మేధావులు మాత్రం కోట్లు సంపాదించే వైద్యులకు కాకుండా ఎవరికైనా ఇచ్చినా అభ్యంతరం లేదని పేర్కొనడం విశేషంపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వరు...పైసా జీతాలు లేకుండా రోజు అందరికీ వార్తలు రాసే పాత్రికేయులకు స్థలాలు ఇవ్వాలంటే లేని పోనీ షరతులు.ప్రెస్ క్లబ్ కు కావాలంటే స్తలం ఇవ్వరు.టీడీపీ పార్టీ కార్యాలయానికి మాత్రం వెంటనే కోట్లు విలువ చేసే స్థలం పార్టీ కార్యాలయానికి జి.ఓ లు తెచ్చుకున్నారు.కోట్లు విలువ చేసే ఆ స్థలంలో రైతుల ధాన్యం నిలువ చేసే గోదాములు కట్టడానికి కూడా పనికిరావా.ఆ స్తలం ఒక్క పార్టీ కార్యాలయం కట్టుకోవడానికి మాత్రమే పనికి వస్తుందా.మరో విచిత్రం ఏమంటే పేదలకు ఒక్క సెంటు స్థలం ఇవ్వాలంటే స్థలాలు దొరకడం లేదని చెప్పే ప్రభుత్వం అధికారులు ప్రైవేటు వైద్యులు కు ఖరీదైన పద్మావతి నగర్ లో 10 సెంట్లు కేటాయిస్తామని చెప్పడం భావ్యమేనా.డాక్టర్లు పెదవారా.ఆ 10 సెంట్ల స్తలం పేదవారికి ఇస్తే వారికి గూడు కల్పించిన వారు అవుతారు.పేద వారి సొంతింటి కల నెరవేరుతుంది.ప్రస్తుతం నంద్యాలలో ఉన్న ఆసుపత్రుల్లో ఏ ఆసుపత్రిలో అయినా 250 నుంచి 1000 రూపాయలు ఓపీ తీసుకుంటారు.ఏ ఆసుపత్రిలో అయినా కనీసం 50 నుంచి 100 మంది వైద్యసేవలు తీసుకుంటున్నారు.ఒక్క ఓపీతోనే సరిపెడతారా టెస్టులు ఎంత లేదన్నా మన అదృష్టం బాగుంటే 2 వేల నుంచి 10 వేలు అవుతుంది.మళ్ళీ అదే ఆసుపత్రిలో తప్ప వారు రాసే మందులు ఎక్కడా దొరకవు.ఆన్లైన్ లో కానీ కొన్ని పెద్ద ,పెద్ద మెడికల్ దుకాణాల్లో 20 నుంచి 30 శాతం ఎమ్మార్పీపై తగ్గిస్తారు.ప్రవేటు ఆసుపత్రుల్లో ఒక్క రూపాయి కూడా తగ్గించరు.నంద్యాలలో ప్రవేటు వైద్యుల ఆస్తులు కోట్లలో ఉన్నాయి.నంద్యాల పరిసర ప్రాంతాల్లో వారి విలాసవంతంగా గడిపేందుకు కోట్లు పెట్టీ విల్లాలు కొనుగోలు చేస్తున్నారు.విలాసవంతమైన జీవితం,పెద్ద,పెద్ద కార్లలో రిచ్ గా గడుపుతారు.కొన్ని ఆసుపత్రుల్లో ఓపీ తో పాటు ఆపరేషన్లు కు ఇక ఎంత వస్తుందో ఆ దేవుడికే తెలియాలి.ఆసుపత్రులకు వచ్చే రోగుల కు రాసిచే టెస్టులు వేరే దయాగ్నొస్టిక్ సెంటర్లకు పంపిస్తే ఏ డాక్టర్ పంపిస్తే ఆ డాక్టర్ కు కమిషను ఇస్తారు.నంద్యాలలో పేరు మోసిన వైద్యులు వారి ఆసుపత్రి లావా దేవులు సరిగా ప్రభుత్వానికి చూపెట్టకుండా దొంగ బిల్లు లు కొందరు చూపెడుతూ ఇన్ కం ట్యాక్స్ ఎగరగొడుతూ మోసం చేస్తున్నారు.గతంలో కొందరు వైద్యుల ఇళ్లపై దాడులు కూడా చేసిన విషయం తెలిసిందే.లక్షలు,కోట్లు ఆస్తులు ఉన్నవారికి పద్మావతి నగర్ లో 10 సెంట్లు ఇవ్వడం అవసరమా.పేద ప్రజలు,వామ పక్ష నాయకులు,విద్యార్థి సంఘాలు,రాజకీయ నాయకులు ఒక్కసారి ఆలోచించండ ప్రవేటు వైద్యులకు 10 కోట్ల స్థలం ఇస్తే సైలెంట్గా ఉంటారా.పేద వారి కోసమైనా వైద్యులకు ఇవ్వకుండా పోరాటం సాగించండి.పేదవారికి ఇస్తే కొందరైనా సొంత ఇల్లు కట్టుకుంటారు.సైలెంట్ గా ఉంటే విలువైన స్థలాలు ఉన్నవారికే చెందుతాయి కానీ లేని వారు లేని వారుగా ఉంటారు.పేదవారు అందరూ ఏకం కండి.పద్మావతి నగర్ లో ప్రవేటు వైద్యులకు 10 కోట్లు విలువచేసే స్తలం ఇవ్వకుండా అడ్డుకోకపోతే మనకు ఒక్క సెంటు స్తలం కూడా రాదు అని గుర్తించండి.పేద వారికి ఇవ్వకుండా వైద్యులకు ఇస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్,మున్సిపల్ స్తలం కాబట్టి మున్సిపల్ మినిస్టర్ నారాయణ,బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్,వైసీపీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్ళండి.ఇప్పటికే కొంత మంది న్యాయవాదులు పేదలకు ఇవ్వకుండా ప్రవేటు వైద్యులకు ఇస్తే కేసులు పెట్టడానికి కూడా సిద్ధం అవుతున్నారు.రాజకీయ నాయకులు కూడా ఒకసారి ఆలోచించండి కొత్త మంది వైద్యులకోసం 10 కోట్ల స్థలం ఇచ్చారంటే పేద వారికి సెంటు స్తలం ఇస్తే దేవుడిలా జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు.నాకు ఎందుకులే అనుకోకుండా ప్రతి ఒక్కరు ఉన్నత స్థాయి రాజకీయ నాయకులకు సమాచారం ఇవ్వండి.ఎలాగూ మంత్రులు కు సంబంధించిన మెయిల్స్ ఉన్నాయి కదా ఇదెక్కడి న్యాయం అని పోస్టులు పెడితే కానీ 10 కోట్ల విలువచేసే స్తలం మనకు దక్కుతుంది.ఒక వేళ పేదలకు స్థలాలు ఇవ్వడానికి నేతలకు ఇష్టం లేకుంటే ఆ స్థలంలో అర్బన్ హెల్త్ సెంటర్ కానీ,ప్రస్తుతం కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు బాడుగ చెల్లిస్తూ కార్యాలయాలు నడుపుతున్నారు.అలా లేకుండా అక్కడ మొత్తం మున్సిపాలిటీకి చెందిన 33 సెంట్ల స్థలం ఉంది.అందులో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు భారం పడకుండా ఉంటుంది.జిల్లా కలెక్టర్ కు సోమవారం పిజిఅర్ఎస్ లో ప్రతి ఒక్కరు పిర్యాదు చేయండి.ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు లేవని చెప్పే అధికారులు ఈ స్థలంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు కట్టవచ్చు ఈ స్తలం వైద్యులకు చెందకుండా ప్రభుత్వ ఆస్తులు కాపాడండి.నూనెపల్లి మార్కెట్ యార్డులో టీడీపీ కార్యాలయానికి ఎలాగూ స్థలం కేటాయించడం జి ఓ ఇవ్వడం,భూమి పూజ కూడా జరిగిన విషయం తెలిసిందే,కనీసం వైసిపి,వామ పక్ష నాయకులు,కాంగ్రెస్ నాయకులు పద్మావతి నగర్ లోని 33 సెంట్లు ఉచితంగా అన్యాక్రాంతం కాకుండా కాపాడుతారని విగ్నేప్తి చేస్తున్నాను.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

### ప్రజాప్రతినిధులు, అధికారులు చురుకుగా పాల్గొనాలి

### ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్



**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 4 నంది పత్రిక** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5, 2026న పశ్చిమగోదావరి జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమాలలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు మరియు ప్రజలు చురుకుగా పాల్గొని పర్యావరణ పరిరక్షణ పట్ల తమ నిబద్ధతను చాటాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సాధ్యమైనంత వరకు అధికారులు, ఉద్యోగులు కార్యాలయాలకు సైకిళ్లపై లేదా ఇతర పర్యావరణహిత రవాణా మార్గాల ద్వారా చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, గ్రామాలు, పట్టణాలు మరియు ప్రజా ప్రదేశాలలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భావితరాలకు స్వచ్ఛమైన, హరితమయమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాను పర్యావరణ పరిరక్షణలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు.

# ఆంగ్రూ అభివృద్ధి చేసిన నూతన బీటీ పత్తి రకంను రైతులకు అందించిన మంత్రి అచ్చెన్నాయుడు

**- రైతుల విత్తన వ్యయాన్ని తగ్గించి అధిక దిగుబడులు అందించే సరికొత్త పత్తి రకం**

**- ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలకు మంత్రి అభినందనలు**

**అమరావతి,బ్యూరో చీఫ్ జూన్ 4నంది పత్రిక** ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఆంగ్రూ) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన నూతన బీటీ పత్తి రకం 'లాం బీజీ టూ–2208 (ఆదిత్య బీజీ–2)' విత్తనాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆవిష్కరించి రైతులకు పంపిణీ చేశారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంగ్రూ ఉపకులపతి డా. పాలడుగు వెంకట సత్యనారాయణతో కలిసి మంత్రి ఈ విత్తనాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రైతులు ప్రతి సంవత్సరం ప్రైవేట్ కంపెనీల నుంచి అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని తగ్గించేందుకు ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు చేపడుతున్న పరిశోధనలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. పత్తి విత్తనాల్లో కల్తీ సమస్యల వల్ల రైతులు నష్టపోతున్న నేపథ్యంలో, ఆంగ్రూ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఈ నూతన రకం రైతులకు భరోసానిచ్చేలా ఉందన్నారు. బీటీ సాంకేతికతపై పేటెంట్ హక్కులు ముగిసిన అనంతరం సుమారు తొమ్మిదేళ్లపాటు శాస్త్రీయ పరిశోధనలు, అఖిల భారత స్థాయి పరీక్షలు నిర్వహించి ఈ రకాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. జాతీయ విత్తన విడుదల కమిటీ ఆమోదంతో విడుదలైన ఈ రకం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగంలో అభివృద్ధి చేసిన తొలి బీటీ పత్తి రకం కావడం గర్వకారణమన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా సాగుకు అనుకూలంగా ఈ రకాన్ని సిఫారసు చేసినట్లు తెలిపారు. లాం బీజీ టూ–2208 రకం హెక్టారుకు 32 నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడిని ఇచ్చే సామర్థ్యం కలిగి ఉందని శాస్త్రవేత్తలు వివరించారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న హైబ్రిడ్ రకాలతో సమానమైన దిగుబడిని ఇవ్వడంతో పాటు మెరుగైన దూది నాణ్యతను కలిగి ఉందన్నారు. ఇది సూటి రకం (వెరైటీ) కావడంతో రైతులు ప్రతి సంవత్సరం కొత్త విత్తనాలు కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా, తమ పొలాల్లో పండించిన పంట నుంచి విత్తనాన్ని భద్రపరచుకొని తిరిగి వినియోగించుకోవచ్చని తెలిపారు. దీంతో విత్తనాలపై అయ్యే పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గుతుందన్నారు ఈ రకం శనగ పచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు వంటి కాయ తొలిచే పురుగులను సమర్థవంతంగా తట్టుకుంటుందని తెలిపారు. అదేవిధంగా పచ్చదోమ, తెల్లదోమ, తామర పురుగులు, పేనుబంక వంటి రసం పీల్చే పురుగుల ప్రభావాన్ని కూడా తగ్గించే లక్షణాలు కలిగి ఉందన్నారు. బ్యాక్టీరియల్ బ్లైట్, సర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు, తుప్పు తెగులు, వెర్రి తెగులు వంటి ప్రధాన వ్యాధులను తట్టుకునే సామర్థ్యం ఉండటంతో రైతులు పురుగు మందులు, తెగుళ్ల నివారణ మందులపై చేసే ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు.



రకం : లాం బీజీ టూ –2208 (ఆదిత్య బీటీ–2) దిగుబడి : హెక్టారుకు 32–35 క్వింటాళ్లు

కాయ బరువు : 5.5 నుంచి 6 గ్రాములు

దూది పొడవు : 29.5 నుంచి 30 మి.మీ– దూది సున్నితత్వం : 4.3 నుంచి 4.6 మైక్రోనైర్దూది బలం : 33.1 గ్రాములు/టెక్స్ ఈ రకం సాధారణ సిఫారసు చేసిన దూరం కంటే సాంద్రతతో సాగు చేసినప్పుడు మరింత అధిక దిగుబడులు సాధ్యమవుతున్నట్లు పరిశోధనల్లో గుర్తించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసిన శాస్త్రవేత్తల బృందాన్ని మంత్రి అచ్చెన్నాయుడు, ఆంగ్రూ ఉపకులపతి డా. పి.వి. సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో విత్తన ధృవీకరణ సంస్థ డైరెక్టర్ డా. యడ్లపల్లి సతీష్, పరిశోధనల సంచాలకురాలు డా. వి. సుమతి, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. ఎన్.వి.వి.ఎస్. దుర్గాప్రసాద్, ప్రధాన పత్తి శాస్త్రవేత్తలు డా. రాఖమణి, డా. ఎన్. చాముండేశ్వరి, డా. చాపర రాజు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి హామీ మేరకు మూత పడిన పాఠశాలలను తెరిపించాలి.

### టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బాలాస్టి రమేష్

**కేసముద్రం, జూన్ 04(నంది పత్రిక):**పిల్లలు రావడం లేదనే సాకుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం కాదా? అని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బాలాస్టి రమేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల కమిటీ సమావేశం గురువారం కేసముద్రం విలేజ్ ప్రాథమిక పాఠశాలలో మండల అధ్యక్షులు గుండు సురేందర్ అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్య అతిథిగా టిపిటిఎఫ్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు బాలాష్టి రమేష్ హాజరై మాట్లాడారు. పిల్లలు వచ్చే అవకాశం ఉన్న బడులను తెరిపిస్తామన్న ముఖ్యమంత్రి హామీ మేరకు మూతబడిన బడులను తెరిపించాలనీ, మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 162 పాఠశాలలు మూసి వేయబడి ఉన్నాయని, అత్యధికంగా మరిపెడ మండలంలో 36, మహబూబాబాద్ మండలంలో 21, కురవి 8, సీరోలు 2 మిగతా మండలాలు కలిపి 95 ఉన్నాయని, తక్షణమే వాటిని తెరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయ సంఘాలతో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి, బడి మూసేసిన ప్రతీ గ్రామాన్ని సందర్శించి, గ్రామస్తులతో అధికారిక సమావేశాలు నిర్వహించాలనీ సూచించారు. బడిబాట పేరుతో భారమంతా టీచర్లపై మోపి చేతులు దులుపుకునే విధంగా బడిబాట ఉండరాదని, బ్యానర్లు, కరపత్రాలతో బడిబాట మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలలో ఉదయం టిఫిన్ కూడా అందిస్తున్న క్రమంలో బడుల పునః ప్రారంభానికి ముందే వంట వండే వారి సంఖ్య కూడా పెంచాలని, వంట గ్యాస్, స్టవ్ లను ప్రభుత్వమే అందించాలని, టీచర్ల కొరత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఎన్.నర్సింహరాజు, కార్యదర్శులు వీసం నర్సయ్య, జి.మోహన్ కృష్ణ, సురేష్, సీనియర్ నాయకులు బందెల రాజు, చీకటి వెంకట్రాంనర్సయ్య, సమ్మెట వెంకటేశ్వర్లు,మహబూబ్ అలీపాల్గొన్నారు.



నంది పత్రిక
శుక్రవారం 05 - 06 -2026

# వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్ర విముక్తికి రెండేళ్లు

**- విధ్వంసం...విద్వేషం...వినాశనం...**
**ఇదే జగన్ ఐదేళ్ల పాలనకు నిర్వచనం**
**- వైసీపీ ఫేక్ బుక్‌లెట్లతో**
**నిజాలు మారవు**
**- గొడ్డలి పోటు... వెన్నుపోటు...**
**పేటెంట్ జగన్‌దే**
**- కేవలం 24 నెలల్లో అభివృద్ధి,**
**సంక్షేమానికి కొత్త దిశ చూపిన**
**కూటమి ప్రభుత్వం**
**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి**
**కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతిబ్యూరో చీఫ్ , జూన్ 4:నంది పత్రిక** వైసీపీ రాక్షస పాలన నుంచి ఆంధ్రప్రదేశ్ విముక్తి పొంది రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీ అరాచక, విధ్వంసక రాజకీయాలకు చరమగీతం పాడారని, ప్రజల స్పష్టమైన తీర్పును అంగీకరించలేకనే వైసీపీ నాయకులు నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. వైసీపీ నిరసనలు ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించే చర్యలేనని అచ్చెన్నాయుడు అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచారని, ప్రతిపక్షాల గొంతు నొక్కి, భయాందోళనల వాతావరణంలో పాలన సాగించారని మండిపడ్డారు. మహానాడు ఘన విజయాన్ని చూసి అసూయ, అక్కసు, ద్వేషంతో రగిలిపోతున్న వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి మరోసారి ఫేక్ బుక్‌లెట్ విడుదల చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని మంత్రి తీవ్రంగా ధ్వజమెత్తారు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేసి, ప్రజల జీవితాలను చీకట్లోకి నెట్టిన వ్యక్తి ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. జగన్ పాలన అంటే అభివృద్ధికి గొడ్డలి పోటు, ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు, రాష్ట్ర భవిష్యత్తుకు వినాశనం అని మండిపడ్డారు. జగన్ చరిత్ర మొత్తం చూస్తే గొడ్డలి పోటు, వెన్నుపోటుకు నిలువెత్తు నిర్వచనమని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. తన బాబాయి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అసలు నిందితులను కాపాడుతూ న్యాయాన్ని ఖూనీ చేసిన వ్యక్తి జగనేనన్నారు. తెలంగాణకు చెందిన శివకుమార్ స్థాపించిన పార్టీని కబ్జా చేసి తన సొంత పార్టీగా మార్చుకున్న వ్యక్తి జగనేనన్నారు. తల్లి, చెల్లికి సైతం న్యాయం చేయకుండా మహిళా ఆస్తి హక్కులకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌దేనని విమర్శించారు. తన అవలక్షణాలను ప్రత్యర్థులపై రుద్దడం, చెప్పిన అబద్ధాన్ని వందసార్లు చెప్పడం జగన్ రాజకీయ శైలిగా మారిందన్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం చీకట్లోకి గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో చట్టవ్యవస్థ, పరిపాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమయ్యాయని అచ్చెన్నాయుడు విమర్శించారు. అధికార మదంతో ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన పాలన చివరకు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో విధ్వంసం చేసిందన్నారు. అనాలోచిత నిర్ణయాలు, విచ్చలవిడి అప్పులతో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని, మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి నవ్యాంధ్రకు ఆశాకిరణమైన అమరావతిని నిర్వీర్యం చేశారని అన్నారు. రోడ్లను కనీసం మరమ్మతులు చేయకుండా రవాణా రంగాన్ని దెబ్బతీశారని, పారిశ్రామికవేత్తలను బెదిరింపులతో పొరుగు రాష్ట్రాలకు తరిమేశారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను మోసం చేశారని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా రైతుల భూములకు అభద్రత సృష్టించారని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. రూ.1,600 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించకుండా అన్నదాతలను మోసం చేశారని అన్నారు. బటన్ నొక్కుతున్నామని ప్రచారం చేసుకుంటూ సంక్షేమ పథకాలపై అనేక ఆంక్షలు విధించి లక్షలాది మందిని లబ్ధికి దూరం చేశారని, తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.1.29 లక్షల కోట్ల భారం మోపారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయి, మాఫియాలకు కేంద్రంగా మార్చి యువత భవిష్యత్తును నాశనం చేశారని, శాంతిభద్రతలను పూర్తిగా దెబ్బతీశారని అన్నారు.

**నవరత్నాలు కాదు... నవ మోసాలు** జగన్ పాదయాత్ర హామీలు, వైసీపీ మేనిఫెస్టో హామీలలో 85 శాతం అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. తల్లికి వందనం పథకం కింద హామీ ప్రకారం ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తున్న కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని చెప్పారు. అయితే ఇద్దరు పిల్లలకు అమ్మఒడి ఇస్తామని చెప్పి చివరకు ఒక్క బిడ్డకే పరిమితం చేసి వైసీపీ మోసం చేసిందన్నారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.14 వేలు, కేంద్రంతో కలిపి రూ.20 వేలు అందిస్తున్నామని, కానీ రైతు భరోసా పేరుతో జగన్ ఇచ్చిన హామీకి విరుద్ధంగా రాష్ట్ర నిధుల నుంచి కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చారని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా అమలు అవుతుంటే వైసీపీ పాలనలో ఆర్టీసీ ఛార్జీలు మూడుసార్లు పెంచారని గుర్తు చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని అన్నారు.

**యువతను మోసం చేసిన జగన్**నిరుద్యోగ భృతి రద్దు చేసి యువతకు అన్యాయం చేసిన వ్యక్తి జగనేనని అచ్చెన్నాయుడు విమర్శించారు. మెగా డీఎస్సీ హామీ ఇచ్చి ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదన్నారు. ఏపీపీఎస్సీని అవినీతిమయం చేశారని, పరిశ్రమలను తరిమివేసి ఉపాధి అవకాశాలను దెబ్బతీశారని ఆరోపించారు. రెండేళ్లలోనే లక్షలాది ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడిపిస్తోందన్నారు. రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 24 లక్షల ఉద్యోగ అవకాశాలకు మార్గం సుగమం చేశామని చెప్పారు.

**సామాజిక న్యాయానికి తూట్లు పొడిచిన వైసీపీ** బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధుల్లో రూ.1.14 లక్షల కోట్లను దారి మళ్లించారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. పసుపు కుంకుమ,



పెళ్లి కానుక వంటి పథకాలను రద్దు చేసి మహిళలకు అన్యాయం చేశారని అన్నారు. పెన్షన్ల విషయంలోనూ ప్రజలను మోసం చేశారని, సీఎం చంద్రబాబు నాయుడు ఒకేసారి పెన్షన్ పెంచితే జగన్ విడతలవారీగా పెంచి ప్రతి పెన్షన్‌దారుడికి వేల రూపాయల నష్టం కలిగించారని చెప్పారు. అన్న క్యాంటీన్లు రద్దు చేసి పేదల కడుపు కొట్టారని, మద్యనిషేధం హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు.

**నేరాలు, అరాచకాలకు ఐదేళ్లు** వైసీపీ పాలనలో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు, విద్యార్థులు, దళితులు, రైతులు, వైద్యులు ఎవరూ రక్షణలో లేరని అచ్చెన్నాయుడు అన్నారు. ప్రజావేదిక విధ్వంసం నుంచి మొదలుకొని తెలుగుదేశం పార్టీ కార్యాలయాలపై దాడులు, దళిత యువకుల హత్యలు, వైద్యుల వేధింపులు, సోషల్ మీడియా పోస్టులకు కేసులు, అక్రమ అరెస్టులు, రాజకీయ కక్షసాధింపులు వరకూ రాష్ట్రాన్ని అరాచకానికి కేంద్రంగా మార్చారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడిని నిరాధార కేసులతో 53 రోజులు జైలులో పెట్టారని, కోడెల శివప్రసాద్ వంటి నాయకులను మానసికంగా వేధించి ప్రాణాలు తీసే పరిస్థితులు సృష్టించారని పేర్కొన్నారు.

**అధికారంలో లేకపోయినా విషప్రచారమే** అధికారం కోల్పోయిన తర్వాత కూడా జగన్ తన వైఖరి మార్చుకోలేదని అచ్చెన్నాయుడు విమర్శించారు. అమరావతి నుంచి విశాఖ పెట్టుబడుల వరకు ప్రతి అభివృద్ధి కార్యక్రమంపై బురదజల్లడం ఆయన రాజకీయంగా మారిందన్నారు. పోలవరం, ఉచిత బస్సు ప్రయాణం, అమరావతి నిర్మాణం, పెట్టుబడులపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, దేవాలయాలు, రైతులు, మహిళలు, దళితులను రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. జగన్ అబద్ధాలు నమ్మేంత అమాయకులు కాదు ఆంధ్రులు ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఫేక్ బుక్‌లెట్లు విడుదల చేస్తే నిజాలు మారవని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విధ్వంసం, విద్వేషం, దోపిడీ, అబద్ధాలు, నేరాలు, కక్షసాధింపులకు ప్రతిరూపమే జగన్ పాలన అని అన్నారు. గొడ్డలి పార్టీ ఐదేళ్ల చీకటి పాలన నుంచి ఆంధ్రప్రదేశ్‌ను కాపాడి, కేవలం 24 నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణ దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# గ్రామాలలో పచ్చదనం -పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత.

## గూడూరు మండలంలో గ్రామసభల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.



**మహబూబాబాద్, జూన్ 04(నంది పత్రిక):**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం గూడూరు మండలం అప్పరాజుపల్లి, పొనుగోడు గ్రామాలలో సర్పంచ్ లు భరత్, భాస్కర్ ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొని, మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డుసభలు నిర్వహించామని, గ్రామాలలో పచ్చదనం పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామాలలో బాల్యవివాహాల నిర్మూలన, గంజాయి మాదకద్రవ్యాల రవాణా వాడకంపై సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. తద్వారా సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేసిన వారు అవుతారని, వ్యవసాయంలో పంట మార్పిడి వల్ల రైతులకు, భూమికి చాలా ప్రయోజనాలున్నాయని. భూమి సారాన్ని కాపాడుతుందనీ, వేర్వేరు పంటలు భూమిలోని వేర్వేరు పోషకాలను ఉపయోగించుకోవడం వల్ల నేల సారం తగ్గకుండా ఉంటుందని తెలిపారు. ఎరువుల ఖర్చు తగ్గి, పప్పుధాన్య పంటలు నత్రజనిని నేలలో పెంచుతాయన్నారు. రసాయన ఎరువుల అవసరం తగ్గి కీటకాలు, వ్యాధులు తగ్గుతాయన్నారు. ఒకే పంటను మళ్లీ మళ్లీ వేస్తే వచ్చే పురుగులు, వ్యాధులు తగ్గుతాయి. కలుపు మొక్కల నియంత్రణ, పంట మార్పిడి వల్ల కలుపు మొక్కల పెరుగుదల తగ్గి పంట ఉత్పత్తి పెరిగి నేల ఆరోగ్యం మెరుగుపడటంతో మంచి దిగుబడి వస్తుందన్నారు. రైతుకు ఆర్థిక లాభం కలిగి వివిధ పంటల ద్వారా ఆదాయం స్థిరంగా ఉంటుందనీ, ఒక పంట నష్టపోయినా మరో పంట ద్వారా లాభం వస్తుందన్నారు. ఈ గ్రామ సభలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, తహశీల్దార్ నాగ భవానీ, మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మలిక్, ఇంచార్జీ ఎంపిడిఓ పృథ్వీ రాజ్, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయం !

తెలంగాణను ముంచిన వారంతా ఇప్పుడు వీరతాళ్లు వేసుకుని..నా తెలంగాణ అంటూ ఊరేగుతున్నారు. విగ్రహాల పేరుతో కొందరు నిగ్రహం కోల్పోయి మాట్లాడుతున్నారు. తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డదని వాపోతున్నారు. ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ కోసం మళ్లీ రాజకీయ రగడ మొదలయ్యింది. ఎవరికి వారు తామే తెలంగాణ భావి విధాతలమని మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. నిజానికి తెలంగాణ ఏర్పడ్డ తరవాత జరిగిన ద్రోహం, అంతకుముందు ఎప్పుడూ జరగలేదు. ఉమ్మడి ఎపిలో జరగనంత దోపిడీ గత 12 ఏళ్లుగా సాగుతోంది. ఎక్కడిక్కడ భూములు దోచుకున్నారు. అప్పుల చేసి దోచుకున్నారు. తెలంగాణను అప్పుసుల కుప్పచేసి అనుభవిస్తున్నారు. ఎవరికి వారు తామే తెలంగాణను ఉద్దరించామని చెప్పుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య తీరలేదు. నీటి సమస్యలు తీరలేదు. నిధులు పారించలేదు. అంతెందుకు రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరలకు కొని సేకరణ సక్రమంగా చేయడంలో కూడా విఫలం అయ్యారు. మక్క, జొన్న, మిర్చి, పత్తి రైతులు ఏటా పడుతున్న కష్టాలను పట్టించుకోని అసమర్థులుగా మిగిలి పోయారు. ఇకపోతే తెలంగాణలో కొత్తగా ఆస్తులు సృష్టించలేదు. అయినా పాలకులుగా పనిచేసిన వారు తామే తెలంగాణను ఉద్దరించామని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రజలకు పెన్షన్లు, ఇళ్లు, ఆరోగ్యశ్రీలు ఎరగా వేసి దర్జాగా దోచేస్తున్నారు. నిజానికి ఉమ్మడి ఎపి నుంచి తెలంగాణ విడివడ్డాక తెలంగాణ అభివృద్ది చెందిందా..లేక అప్పుల పాలయ్యిందా అంటే..అప్పుల పాలయ్యిందని లెక్కలు చెబుతున్నాయి. సమయానికి జీతాలు ఇవ్వలేని వారు పాలకులు అయ్యారు. హైదరాబాద్ మా అయ్య జాగీరా అని జనసేనాని పవన్ కళ్యాణ్ అనగానే కొందరు ఒంటి కాలిపై లేచి..అవును మా అయ్య జాగీరే అంటున్నారు. ఎందుకంటే మూడో వ్యక్తి వస్తే..దోచుకోవడానికి అవకాశం ఉండదు కనుక...ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణ సమాజాన్ని బెదిరిస్తున్నావంటూ పవన్‌ను చీల్చి చెండాడేంత పని చేశారు. పవన్ మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు నిజంగానే తెలంగాణలోని కొందరికి బాధ కలిగించాయి. అందులో అనుమానం లేదు. రాజకీయంగా తెలంగాణలో ఉన్న కొందరు జనసేనలోనూ ఉన్నారు. వారికి పదవులు రావాలంటే జనసేన పక్షాన పోటీ చేయాల్సిందే. రాజకీయ పార్టీ అన్న తరవాత పోటీకి సై అంటుంది. జనసేన కూడా అదే చేసింది. అయితే మిగతా ప్రాంతాలకు, తెలంగాణకు ఓ రేఖ అడ్డంగా ఉంది. అదే సెంటిమెంట్. తెలంగాణ ప్రజలను ముంచిందే సెంటిమెంట్. ఆ సెంటిమెంట్‌తోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డది. అది అడ్డం పెట్టుకునే కెసిఆర్ కుటుంబం పదేళ్లు దర్జాగా తెలంగాణలో పాగా వేసి, ఇష్టారాజ్యంగా దోచుకున్నది. పదవులు, డబ్బులు, భూములు దోచేసారు. లక్షల కోట్లు తెలంగాణ నెత్తిన అప్పులు పెట్టారు. తరవాత గత రెండేళ్లుగా కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. అభివృద్ది పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు పప్పు బెల్లాల్లా తెలంగాణను పంచుకుంటున్నారు. భూములు యధేచ్చగా అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ రాకతో మరోమారు సెటిమెంట్ రగిల్చి బాగుపడాలన్న ధోరణిలో పొన్నం ప్రభాకర్, కెటిఆర్, కవితలు తామే అసలుసిసలు తెలంగాణ వారుసులమని చెప్పుకునే ప్రయత్నంలో పడ్డారు. తెలంగాణ సమాజం అస్తిత్వ సంక్షోభంల పడుతున్నదనీ గొంతు చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఆంధ్రా ఆధిపత్యం కిందకు వెళుతోందని ప్రకటించుకున్నారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీ వెనక బిజెపి, మోడీ ఉన్నారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కూడా భారతదేశంలోనే ఉందని, అందుకు బిజెపి ఎక్కడైనా పావులు కదుపుతుందని తెలుసుకోవాలి. బిజెపికి తెలంగాణ కూడా ఒక రాష్ట్రమని తెలుసు. ఇక్కడ పాగా వేయాలని ఎప్పటనుంచో కలలు కంటోంది. కనుక దాని ప్రయత్నాల్లో అది ఉంది. ఇది రాజకీయం. కెసిఆర్ కూడా భారత రాష్ట్ర సమితి అంటూ దేశాన్ని ఏలుతానని అన్ని రాష్ట్రాలు తిరిగారు. దానిని ఎవరైనా తప్పుపట్టారా అన్నది కెటిఆర్ చెప్పాలి. రాజకీయ పార్టీ పెట్టి ఇక్కడ వైఎస్ షర్మిల కూడా పాదయాత్ర చేశారు. తాను తెలంగాణ బిడ్డనని ప్రకటించుకున్నారు. అప్పుడు లేని రోషం ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నది ప్రశ్న. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వరాష్ట్రంలో ఆంధ్రా వలసవాదం పెరిగింది. దానికి కెసిఆర్ ఆద్యులు. ఆయనే మాకు ఆంధ్రాతో పేచీ లేదంటూ..జగన్‌ను పిలిచి భోజనం పెట్టి అలయ్ భలయ్ చేసుకున్నారు. కృష్ణా నీటిని ఎపికి దోచి పెట్టారని వస్తున్న ఆరోపణలకు కెసిఆర్ బృందం నుంచి సమాధానం లేదు. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకుని, హైదరాబాద్ సంపదను కొల్లగొట్టడానికి వస్తున్నారని జనసేనాని పవన్ కళ్యాణ్‌ను విమర్శించే ముందు..ఇక్కడ ఎంత కొల్లగొట్టారో చెప్పాలి. ధరణి పేరుతో మోసాలు. కాళేశ్వరం పేరుతో దగా. టెలిఫోన్ ట్యాపింగ్. అస్మదీయులకు రాజ్యసభ పదవులు.. ఇలా చెప్పుకుంటూ పోతే కథలు కోకొల్లలు. ఇప్పుడు రెండేళ్ల పాలనలో మంత్రులందరిపైనా అవినీతి గుప్పు మంటోంది. అయినా ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు.

తెలంగాణ మేధావులు నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ వచ్చాకనే స్వేచ్ఛ వచ్చిందని కోదండరామ్ సార్ అంటున్నారు. అంటే కెసిఆర్ ఉన్నంతకాలం నిరంకుశ పాలనలో మగ్గామనే అర్థం కదా. తెలంగాణ అస్తిత్వం మీద దాడిలో, మోదీ, చంద్రబాబుల ఉమ్మడి ప్రణాళిక దాగి ఉందని ఘోషిస్తున్న వారు, ఏ రకమైన దాడి జరిగిందో చెప్పాలి. ఈ గడ్డపై నివసిస్తూ ఇక్కడే మమేకమైన వారంతా తెలంగాణ బిడ్డలే. వాళ్ల పిల్లల భవిష్యత్తు, వారి ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ ఈ తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి. రాజకీయ పార్టీలు అన్ని చోట్లా తమ అస్తిత్వం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. కెసిఆర్ కుటుంబానికి చెందిన పార్టీలే తెలంగాణకు ప్రతినిధులు కాదు.

తెలంగాణ కోసం కష్టపడే వారు ఎవరైనా రాజకీయలు చేసుకునే హక్కు ఉంటుంది.

రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనిని తప్పుపట్టడానికి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారం చలాయించిన సమైక్య పాలకులు, తెలంగాణ ఏర్పాటుతో అధికారం చేపట్టిన వారు కూడా తెలంగాణను నిలువునా దోచుకున్నారు. కాబట్టి ఎవ్వరు కూడా తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడలేదు. తమ స్వార్థ రాజకీయం కోసమే పోరాడారు. ఇంకా పోరాడుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఇదే సెంటిమెంటుతో తమ ఉనికి కోసం కొందరు ఇప్పుడు నానా యాగీ చేస్తున్నారని గుర్తిస్తే మంచిది.

# పాలమూరు ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

## పలు ప్రాజెక్టులను ఏరియల్ సర్వే చేసిన సిఎం

## ప్రాజెక్టుల స్థితిగుతలపై అధికారులతో ఆరా

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమశిలలో ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా ఏరియల్ సర్వే నిర్వహించారు. ముఖ్యమంత్రి , మంత్రుల బృందం పాలమూరు జిల్లాలోని పలు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఆకాశ మార్గం ద్వారా క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదించిన నూతన బ్యారేజీల స్థలాలు, , జూరాల ప్రాజెక్టు డ్యామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి వీక్షించారు. ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గ పరిధిలోని కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పథకంలో అత్యంత కీలకమైన కాట్రేవుపల్లి పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పనుల నిర్మాణ శైలిని, పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వీక్షించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుండటంతో దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఏరియల్ సర్వే అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రుల బృందం కూడా ప్రాజెక్టుల వారీగా ఉన్న అడ్డంకులను తొలగించి, పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించింది.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com